ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
గురువారం 6 ఫిబ్రవరి 2025



ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరణ
యువకుడి ఆత్మహత్య 7
స్కూల్ బస్సు ఢీకొని
బాలుడి మృతి



ఏసీబీకి చిక్కిన పుల్లారావు, కావ్యారెడ్డి

గోలీ సోడాల యూనిట్ నిర్వాహకుడి నుంచి

రూ.22 వేలు లంచం

ఏసీబీకి చిక్కిన ఆహార తనిఖీ అధికారిణి, అటెండర్

తనిఖీల్లో మరో 87 వేల రూపాయలు స్వాధీనం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గోలీసోడాల తయారీ యూనిట్ నిర్వాహకుడి నుంచి రూ.22 వేలు లంచం తీసుకున్న జిల్లా ఆహార తనిఖీ అధికారిణి, ఆ శాఖ అటెండర్ ఏసీబీకి చిక్కారు. ఏసీబీ డీఎస్పీ వి.సుబ్బరాజు తెలిపిన వివరాలివి.. ఏలూరు రూరల్ మండలం కాట్లంపూడికి చెందిన నంబూరి సాయిసుందర్ గోకుల్ (25) ఏలూరు- జంగారెడ్డిగూడెం రోడ్డులో మరనాత ఎంటర్‌ప్రైజెస్ హోప్స్ గోలీసోడాలు తయారు చేస్తున్నాడు. ఇటీవల యూనిట్ వద్ద తనిఖీలు చేసిన ఆహార తనిఖీ అధికారిణి దొండపాటి వెంకట కావ్యారెడ్డి (29) కొన్ని రసాయనాలను సీజ్ చేశారు. వాటిలో ఈగలు ఉన్నాయని, రిపోర్టు అనుకూలంగా కావాలంటే రూ.25 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. చివరకు రూ.20 వేలు తీసుకునేందుకు ఒప్పుకుని ఆమె వద్ద ఉన్న అటెండర్ పులపా పుల్లారావు (61)కు మరో రూ.రెండు వేలు ఇవ్వాలని ఆమె ఆదేశించింది. అయితే లంచం ఇవ్వడం ఇష్టం లేని గోకుల్ జిల్లా ఏసీబీ డీఎస్పీ సుబ్బరాజును ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి నిఘా ఉంచారు. మంగళవారం కావ్యారెడ్డి, అటెండర్ పుల్లారావు వేరే ప్రాంతాలకు తనిఖీలకు వెళ్ళి రాత్రి పొద్దుపోయిన తర్వాత కార్యాలయానికి చేరుకున్నారు. లంచం సొమ్మును కావ్యారెడ్డి తన అటెండర్‌కు ఇవ్వాలని గోకుల్‌కు చెప్పడంతో అదేవిధంగా ఇచ్చాడు. అనంతరం వారు బయటకు వస్తుండగా ఏసీబీ అధికారులు పుల్లారావును, కావ్యారెడ్డిలను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.22 వేల నగదును సీజ్ చేశారు. బుధవారం ఉదయం 8.30 గంటల వరకు కార్యాలయంలోనే తనిఖీలు చేశారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కావ్యారెడ్డి తనిఖీకి వెళ్ళి వచ్చిన కారులో రూ.87 వేల నగదు లభ్యం కాగా దానిని సీజ్ చేశారు. బుధవారం ఉదయం వారిద్దరిని అరెస్టు చేసి తొలుత టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు అనంతరం రాజమండ్రి ఏసీబీ కోర్టుకు తరలించగా 14 రోజులు రిమాండ్ విధించారు. కావ్యారెడ్డి నాలుగేళ్ల క్రితం ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా శాఖ లో చేరారు. పుల్లారావు మరో ఏడాదిలో ఉద్యోగ విరమణ చేయనున్నాడు. కాగా వారిద్దరి ఇళ్లల్లోను ఏసీబీ అధికారులు తనిఖీలు చేశారు. అయితే ఎలాంటి ఆధారాలు లభించలేదు.

ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు 276 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ఒకేషనల్ విభాగం ప్రాక్టికల్స్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 20వ తేదీ వరకు జరుగుతాయి. జిల్లాలోని 14 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు ఉదయం పూట 1010 మంది విద్యార్థులకు 810 మంది, మధ్యాహ్నం 727 మందికి 651 మంది హాజరయ్యారని ఇంటర్‌బోర్డు ఆర్ఐవో చంద్రశేఖరబాబు తెలిపారు. మొత్తంగా 276 మంది గైర్హాజరైనట్టు తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా ముగిసిందన్నారు. కాగా జనరల్ విభాగం ప్రాక్టికల్స్ ఈ నెల 10నుంచి ప్రారంభం కానున్నాయి.

చిన్నారులపై కర్కశత్వం



జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో బాధిత చిన్నారులతో ఆర్డీవో ఎంవీ రమణ, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి డాక్టర్ సూర్యచక్రవేణితో పాటు ఇతర అధికారులు

అమాయకులైన చిన్నారులపై కర్కశత్వం. కన్న తల్లి ఎదుటే మారు తండ్రి సెల్‌ఫోన్ వైరుతో కిరాతకంగా బాదుతుంటే.. వీపు నిండా వాతలు తేలుతుంటే బాధ ఓర్చలేక గిలగిలలాడిన పిల్లలు. ఎందుకిలా జరుగుతుందో అర్థం కాక బావురమంటూ వీధిన పడితే.. ఇరుగు పొరుగే అక్కున చేర్చుకున్నారు.. నాలుగు రోజుల క్రితం జంగారెడ్డిగూడెంలో జరిగిన అమానుషమిది.

ముక్కు పచ్చలారని చిన్నారి కాస్తంత మారాం చేస్తే ఎవరైనా ఓపికగా బుజ్జగిస్తారు. తప్పు కదాని సున్నితంగా మందలిస్తారు. కాని ఆగ్రహం కట్టలు తెంచుకుని ఎల్‌కేజీ చదువుతున్న చిన్నారి వీపుపై ఓ ఉపాధ్యాయుడు విచక్షణ మరచి చేతులతో చరిచాడు. పిడిగుద్దులు గుద్దాడు. చిన్నారి గుక్క తిప్పుకోకుండా ఏడుస్తున్నా కనికరం చూపలేదు. తన రాక్షసత్వాన్ని ప్రదర్శించాడు.. రెండు రోజుల క్రితం ముసునూరు మండలం చెక్కపల్లిలో చోటు చేసుకున్న ఇంకో ఘోరమిది.

అదుపు తప్పుతున్న బాంధవ్యాలు.. నానాటికీ పెరుగుతున్న హింస

మొన్న జంగారెడ్డిగూడెం.. నిన్న చెక్కపల్లిలో వరుస అమానుషాలతో ఉలికిపాటు

ఇరుగు పొరుగు జోక్యంతో రంగంలోకి పోలీసులు, అధికారులు

(ఏలూరు- ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఈ సంఘటనలను చూస్తుంటే రాను రాను మానవత్వం దారి తప్పుతుందా ? మనుషుల మధ్య బంధాలు తెగిపోతున్నాయా ? స్వార్థ చింతనదే పైచేయి అవుతుందా ? క్షణికావేశాలు రాక్షసత్వానికి దారి తీస్తున్నాయా..? అంటే అవుననే సమాధానం ఎదురవుతోంది. గతంలో చిన్నా, పెద్దా భేదం ఉండేది. అయిన వారికి, కాని వారికి మధ్య సత్సంబంధాలు ఉండేవి. చాలాకాలం నుంచి ప్రజా జీవితంలో మార్పులు, వచ్చాయి. సంబంధ బాంధవ్యాలు దారుణంగా చెరిగాయి. కుటుంబాల్లో అనిశ్చితి చోటు చేసుకుంది.



ఫలితంగా జీవన విధానమే మారింది. సమాజంలో తాము ఎలా ఉన్నా ఎవరు ప్రశ్నించలేరన్న గుణం పెరిగింది. ఈ కారణంగానే ముక్కుపచ్చలారని చిన్నారుల దగ్గర నుంచి వయో వృద్ధుల వరకు వేధింపులు తప్పడం లేదు. పాపం పుణ్యం ఏనాడో మరుగున పడ్డాయి. ఈ మధ్య కాలంలో చిన్నారులు అనేకచోట్ల ఏదొక విధమైన దాడులకు గురవుతూనే ఉన్నారు. కొన్ని పోలీసుల దృష్టిలోకి వచ్చి ఫిర్యాదుల రూపంలో నమోదవుతున్నాయి. భార్యాభర్తల మధ్య వివాహ బంధాలు చెదిరినప్పుడు ఆ ప్రభావం పిల్లలపై పడుతోంది. న్యాయస్థానాల వైపు మళ్లిన ప్పుడు పిల్లలను పంచుకునే దశకు చేరారు. ఆఖరికి కన్న బిడ్డలను ఎవరో మీదో కోపంతో హింసించడానికి వెనుకాడడం లేదు. ఆఖరికి స్కూల్లో మంచి మార్కులు రావటం లేదని పిల్లల్ని హింసించిన వారెందరో. ఇరుగుపొరుగు వారు జోక్యం చేసుకుంటే తప్ప ఈ తరహా హింసను అడ్డుకోలేనంత స్థాయికి ఎదిగింది. జంగారెడ్డిగూడెంలో మారుతండ్రి ఒకరు వ్యవహరించిన విధానమే దీనికి నిదర్శనం. ఇష్టానుసారం వ్యవహరిస్తున్న వ్యక్తిని అడ్డుకోవాల్సిన తల్లి ప్రేక్షకపాత్ర వహించడం నానాటికీ మారుతున్న బాంధవ్యాలకు పక్కా నిదర్శనం.

జంగారెడ్డిగూడెం ఘటనలో కన్న తల్లే జరిగినంతా ఓ సినిమాగా భావించినా ఇరుగు పొరుగే చిన్నారుల పక్షాన నిలవడంతో వారు ప్రభుత్వ బాల, బాలికల సంరక్షణా కేంద్రానికి చేరుకోగలిగారు. చిన్నారులపట్ల అమానుషంగా వ్యవహరించిన వ్యక్తిని కటకటాల వెనక్కి నెట్టారు. చెక్కపల్లి ఘటనపై డీవైఈవో విచారణకు కదిలి వచ్చారు. చిన్నారిపై అమానుషంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడితోపాటు ఆ ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలకు ఉపక్రమిస్తున్నారు.

రాక్షసులుగా మారుతున్నారు



డాక్టర్ ఎ.హరికృష్ణ, సాధారణ వైద్య నిపుణుడు, ఏలూరు

పిల్లల్ని చూడగానే ఎవరైనా ముచ్చటపడతారు. ఇటీవల పిల్లలపై దాడులు పెరిగాయి. క్షణికావేశంలో రాక్షసుల్లా మారి వారు క్రూరంగా చిత్రహింసలకు గురిచేస్తున్నారు. వ్యక్తిగత సమస్యలతో మానసిక ఒత్తిళ్లకు గురై ఆ కోపాన్ని అందుబాటులో ఉన్న పిల్లలపై చూపిస్తున్నారు. కొందరు సవతి తల్లులు, దండ్రులు పిల్లలు అడ్డుగా ఉన్నారని కక్షలు పెంచు కుని అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. ఉపాధ్యా యుల్లో కొందరు వ్యక్తిగత ఒత్తిళ్ళతో పాఠశాలలకు వచ్చిన చిన్నపిల్లలను చిత్రహింసలు చేస్తున్నారు. ఇలాంటి వారిని మానసిక వైద్యులకు చూపించాలి.



భవిష్యత్తు నాశనం

సూర్యచక్రవేణి, బాలల సంరక్షణాధికారిణి, ఏలూరు,

మానవత విలువలు కోల్పోతున్నారు. పెద్దలు తమ సుఖాలను చూసుకుంటున్నారు. పిల్లల భవిష్యత్తును పట్టించుకోవడం లేదు. బంగారు భవిష్యత్తు ఉన్న పిల్లల జీవితాలను నాశనం చేస్తూ తమ స్వార్థంతో జీవిస్తున్నారు. పిల్లల భవిష్యత్తు కాపాడాలనుకున్న తల్లిదండ్రులు తమ స్వార్థాన్ని త్యాగం చేయాలి. కొన్నింటిని వదులుకోవాలి. కాని వారి సుఖాలతోనే పిల్లల జీవితాలు చీకటిమయం అవుతున్నాయి. బాలలపైన దాడులు పెరుగుతున్నాయి. బాలలపై దాడులకు పాల్పడిన వారిపై బీఎన్ఎస్ చట్టంతో పాటు, జువైనల్ జస్టిస్ యాక్టులో బాలల సంరక్షణ కోసం ఉన్న ప్రత్యేక సెక్షన్లు అమలు చేయిస్తాం. కచ్చితంగా శిక్షలు పడేలా చర్యలు చేపడతాం.

పోలీసుల అదుపులో.. టీచర్, ప్రిన్సిపాల్

చిన్నారికి విజయవాడలో మెరుగైన వైద్యం



పాఠశాలలో తహసీల్దార్ రాజ్‌కుమార్ విచారణ

ముసునూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి):చెక్కపల్లి చైతన్య స్కూల్‌లో నాలుగేళ్ల చిన్నారిని ఉపాధ్యాయుడు చితకబాదిన ఉపాధ్యాయుడిని, ప్రిన్సిపాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై అధికారులు విచారణ చేపట్టారు. నూజివీడు డీవైఈవో ఎం.సేవ్యా, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఎంఈవో టీవీఎస్ సుబ్బారావు తదితరులు ఘటనపై ప్రిన్సిపాల్ మరీదు నాగరాజు, ఉపాధ్యాయుడు సురేష్, సిబ్బందితోపాటు చిన్నారి తల్లిదండ్రులు, అమ్మమ్మలను విచారించారు. ఈ ఘటనపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని వారు తెలిపారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు చిన్నారి బంధువులు పాఠశాల వద్ద ఆందోళన చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు. చిన్నారి వైష్ణవిని మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

అంతర్మథనం



వైస్ చైర్మన్ పదవి పరిణామాలపై తెలుగు తమ్ముళ్లలో చర్చ

చైర్‌పర్సన్ కుర్చీ కోసం టీడీపీ కసరత్తు

నూజివీడు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు పురపాలకంలో జరిగిన నాటకీయ పరిణామాలతో సీనియర్ తెలుగు తమ్ముళ్ళు అంతర్మథనంలో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పలు మునిసిపాలిటీల వైస్ చైర్మన్, చైర్మన్‌ల ఎన్నికల్లో వైసీపీ నుంచి వచ్చిన వారి మద్దతుతో, స్థానికంగా తెలుగుదేశం నుంచి గెలుపొందిన కౌన్సిలర్లకే పదవులు రాగా దానికి భిన్నంగా నూజివీడులో వైసీపీ నుంచి వచ్చిన వారికి వైస్ చైర్మన్ పదవి దక్కడం సర్వత్రా చర్చకు దారి తీసింది. రానున్న 13 నెలల్లో పురపాలకం గడువు ముగియనుంది. ప్రస్తుత నిర్ణయం వల్ల భవిష్యత్‌లో పార్టీకి మేలు జరుగుతుందా?లేక నష్టం జరుగుతుందా? అనే విషయం పై తెలుగుదేశం కార్యకర్తలు అంచనాలు వేస్తున్నారు.

అక్కడ అలా.. ఇక్కడ ఇలా..

గతంలో వైసీపీ వారు స్థానిక సంస్థల్లో చేసిన అరాచకాలకు సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు గట్టిగానే వారికి బుద్ధి చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా కార్యకర్తలు గుర్తు చేసుకుంటున్నారు. తిరుపతి కార్పొరేషన్‌లో 47 వార్డులు ఉండగా, గత ఎన్నికల్లో 46 వార్డుల్లో ఏకపక్షంగా వైసీపీ వారు గెలుపొందగా, కేవలం ఒక వార్డులో టీడీపీ గెలిచింది. ఇప్పుడు జరిగిన ఎన్నికల్లో వైసీపీ తరపున డిప్యూటీ మేయర్‌గా పోటీ చేసిన భాస్కర్‌రెడ్డికి 21 ఓట్లు రాగా, టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన మున్నికృష్ణకు 26 ఓట్లు పోలై డిప్యూటీ మేయర్‌గా పీఠం ఎక్కారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని నందిగామ పురపాలకంలో వైసీపీ నుంచి వచ్చిన అభ్యర్థికి చైర్మన్ పదవి ఇవ్వాలని, తొలుత ఎన్నికలకు ముందు కొందరు నిర్ణయించగా, ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే సౌమ్య అడ్డం తిరిగి తెలుగుదేశం తరపున గెలిచిన వారికే ఈ పీఠం దక్కాలి? లేకపోతే నేను రాజీనామాకైనా సిద్ధమేనని తెలుగుదేశం జిల్లా నాయకులకు స్పష్టం చేయడంతో ఒకరోజు ఎన్నిక వాయిదా వేసి తిరిగి తెలుగుదేశం తరపున గెలిచిన వారికే చైర్మన్ పదవిని అప్పగించిన విషయం ఉమ్మడి కృష్ణా జిల్లాలో చర్చకు దారి తీసింది. నూజివీడు కౌన్సిల్లో ఏడుగురు తెలుగుదేశం కౌన్సిలర్లు ఉండగా, వైసీపీ నుంచి వచ్చిన వారికే వైస్ చైర్మన్ ఇవ్వడం దానికి, మనం ఏడుగురే కదా ఉంది అని సర్దిచెప్పాలనే ధోరణిలోనే స్థానిక నాయకత్వం వ్యవహరిస్తున్న తీరుపై నూజివీడు పట్టణ తెలుగు తమ్ముళ్ళల్లో అసంతృప్తి నెలకొంది.

చైర్మన్ పదవి పై చర్చ

మార్చిలో నూజివీడు చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టడానికి తెలుగుదేశం ప్రయత్నాలు ప్రారంభించింది. దీంతో చైర్‌పర్సన్ సీటుపై ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం చైర్‌పర్సన్ రేసులో నూజివీడు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మల్లిశెట్టి జగదీష్ భార్య 26వ వార్డు కౌన్సిలర్ అయిన మల్లిశెట్టి ప్రియదర్శిని, వైసీపీ నుంచి టీడీపీలోకి తాజాగా వచ్చిన 31వ వార్డు కౌన్సిలర్ మేకల రమాదేవిల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

కౌన్సిల్ రద్దుకు వైసీపీ యత్నాలు

చైర్‌పర్సన్ పదవిని రక్షించుకునే పరిస్థితిలో ఉన్న వైసీపీ చివరి అస్త్రంగా అవసరమైతే కౌన్సిల్ రద్దు అయ్యే మార్గాల కోసం అన్వేషణలో ఉంది. ఉన్న కౌన్సిల్లో 51 శాతం మంది సభ్యులు రాజీనామా చేస్తే కౌన్సిల్ రద్దయ్యే అవకాశం ఉండటంతో దీనిని చివరి అస్త్రంగా ప్రయోగించడానికి వైసీపీ పాట్లు పడుతోంది. నూజివీడు కౌన్సిల్లో 32 వార్డులు ఉండగా, ప్రస్తుతం టీడీపీకి 17, వైసీపీకి 15 మంది కౌన్సిలర్లు బలం ఉంది. దీంతో టీడీపీకి వెళ్ళిన తాజా కౌన్సిలర్లలో ముగ్గుర్ని తిరిగి తమ గూటికి రప్పించుకుని అందరూ కలిసి రాజీనామా చేస్తే నిబంధనల ప్రకారం కౌన్సిల్ రద్దు అయ్యే ప్రమాదం ఉండటంతో ఈ విషయంపై వైసీపీ స్థానిక నాయకత్వం దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

కల్లుగీత మద్యం

లైసెన్సులకు గడువు పెంపు

- 8 వరకు దరఖాస్తుకు ఛాన్స్
- 10న లాటరీ ద్వారా కేటాయింపు

ఏలూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కల్లుగీత కార్మికుల ఉపకులాలకు రిజర్వ్ చేసిన 14 మద్యం దుకాణాల లైసెన్సుల కోసం మరింత ఎక్కువ మందికి అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం దరఖాస్తు గడువును ఈనెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పొడిగించిందని ఏలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య తెలిపారు. ఏలూరు శ్రీరామ్ నగర్‌లోని ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎస్‌జి పాండురంగారావుతో కలిసి బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆవులయ్య మాట్లాడుతూ.. 'గతనెల 27న ఈ షాపులకు నోటిఫికేషన్ విడుదల చేసి, దరఖాస్తు గడువును ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఇవ్వగా ఇప్పటి వరకు 14 షాపులకు 23 దరఖాస్తులే వచ్చాయి. దరఖాస్తు గడువును ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పొడిగించారు. అర్హులైన కల్లుగీత కార్మికులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈనెల ఏడున నిర్వహించాల్సిన దుకాణాల లాటరీ కేటాయింపు ప్రక్రియను ఈ నెల 10వ తేదీ ఉదయం 9 గంటలకు మార్పు చేశాం. వేదికను సురేష్ బహుగుణ పోలీస్ స్కూల్ నుంచి మినీ బైపాస్ రోడ్డులోని చలసాని గార్డెన్స్ ప్రాంగణంకు మార్పుచేశా'మని ఆయన తెలిపారు.



కన్నుల పండువగా శోభనాచలుని రథోత్సవం

ఆగిరిపల్లిలో శోభనాచల వ్యాఘ్ర లక్ష్మి నరసింహాస్వామి రథోత్సవం బుధవారం నేత్రపర్వంగా సాగింది. మంత్రి కొలుసు పార్థసారథి కుంభం పోసి రథోత్సవాన్ని ప్రారంభించారు. 6

సొంతింటి కల నెరవేరేలా..



- సొంత స్థలం ఉండి ఇల్లు లేని లబ్ధిదారుల గుర్తింపు
- జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో సర్వే పూర్తి
- గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతున్న సర్వే
- అర్బన్ ప్రాంతాల్లో సొంత స్థలం ఉండి ఇల్లు లేనివారు 1,299 మంది
- పీఎంఏవైయూ-2.0 పథకంలో జిల్లాకు 1,235 ఇళ్లు మంజూరు

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ హౌసింగ్‌లో అందరికీ ఇళ్ల అనే ప్రాతిపదికపై ఇళ్ల మంజూరు చేశారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీలు ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యంతో సొంత స్థలం ఉన్నా కొంతమంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు కాలేదు. జగనన్న కాలనీల్లోను ఇళ్ల నిర్మాణాలు అంతంత మాత్రంగానే సాగాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టణాల్లో నిర్మించిన టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు అందజేయకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఈ పరిస్థితులన్నింటినీ పరిశీలించిన రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం పట్టణ ప్రాంత మండలాల్లో సొంత స్థలం ఉండి ఇళ్ల లేని లబ్ధిదారులను గుర్తించడానికి సర్వే నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఏలూరు కార్పొరేషన్, జంగారెడ్డిగూడెం, నూజివీడు, చింతలపూడి పట్టణ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి సర్వే బృందం సర్వే నిర్వహించింది. వచ్చిన సర్వే నివేదికల ఆధారంగా ఇళ్ల కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

1,299 మంది లబ్ధిదారుల గుర్తింపు

జిల్లాలో అర్బన్ ఏరియాల్లో సొంత స్థలం ఉండి ఇళ్ల లేని లబ్ధిదారులు 1,299 వరకు ఉన్నారని ఈ సర్వేలో తేలింది. ఈ సర్వే ఆధారంగా వారికి ఇళ్ల మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా వ్యాప్తంగా పీఎంఏవైయూ-2.0 పథకంలో 1,235 ఇళ్ల మంజూరయ్యాయి. ఈ పథకంలో ఒక్కొక్క ఇంటికి రూ.2లక్షల 50 వేలు మంజూరు చేస్తారు. ఇందులో రూ.లక్షా 50 వేలు కేంద్ర ప్రభుత్వ వాటా కాగా రూ.లక్ష రాష్ట్ర ప్రభుత్వ వాటాగా ఉంది. స్వయం సహాయక సంఘాలకు రూ.లక్ష అదనంగా రుణ సౌకర్యం కల్పిస్తారు. అర్బన్ ఏరియాలో నిర్వహించిన సర్వేలో వార్డు సచివాలయాలకు చెందిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

జన్‌మన్ పథకంలో ఎస్టీ వర్గాలకు..

ఇక కేంద్ర ప్రభుత్వ సాయంతో ఏజెన్సీ ప్రాంతంలో జన్‌మన్ పథకంలో గిరిజనులకు ప్రత్యేకంగా ఇళ్ల కేటాయించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి జిల్లాకు 450 ఇళ్ల మంజూరయ్యాయి. సొంత స్థలం ఉండి ఇల్లులేని వారికి ఈ పథకంలో ఇల్లు మంజూరు చేస్తారు. ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.2.39 లక్షలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తుంది. ఈ పథకానికి సంబంధించి పోలవరం మండలంలో లబ్ధిదారుల సర్వే నిర్వహిస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతున్న సర్వే

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో సొంత స్థలం ఉండి ఇల్లు లేని లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు చేయాలనే ఉద్దేశ్యంతో సర్వే నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి వెళ్ళి సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారు. ఎంత మందికి సొంత స్థలాలు ఉన్నాయి, ఇప్పటివరకు ఇల్లు ఎందుకు కేటాయించలేదన్న వివరాలను వారు ఈ సర్వేలో సేకరిస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో సొంత స్థలం ఉన్నా కొంతమంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు కాని పరిస్థితి. గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఈ సర్వేలో పాల్గొని వివరాలు సేకరిస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి ఈ సర్వే పూర్తి చేయాలని నిర్దేశించుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రభుత్వ ఐటీఐ విద్యార్థికి ప్రథమ బహుమతి


సిద్దుకి బహుమతి అందజేస్తున్న ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ గణేష్‌కుమార్, తదితరులు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఐటీఐ విద్యార్థులకు ఎన్టీఆర్ జిల్లా ఆత్కూరులోని స్వర్ణ భారతి ట్రస్టులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల 'ఎలక్ట్రికల్ ఇన్‌స్టలేషన్' విభాగంలో ఏలూరు ప్రభుత్వ ఐటీఐ విద్యార్థి కాట్రు సిద్దు ప్రథమ బహుమతి అందుకున్నాడని ప్రిన్సిపాల్ పి.రజిత తెలిపారు.పోటీల్లో భాగంగా 1 బీహెచ్‌కే ఇంటికి వైరింగ్, లైట్లు, ఫ్యాన్లు, మోటార్ స్టార్టర్, సోలార్ పవర్ పరికరాల అమరికల్లో పని వేగవంతం, నిపుణత,నాణ్యత, తదితర అంశాల్లో ప్రతిభను పరిశీలించారు. ఈ పోటీల్లో సిద్దు మొదటిస్థానంలో నిలిచి ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి పోటీకి ఎంపికైనట్టు వివరించారు. రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతిలో భాగంగా సిద్దుకి ప్రశంసాపత్రం, రూ.30 వేలు నగదు బహుమతిని ఏపీఎస్ఎస్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో జి.గణేష్‌కుమార్ అందజేశారని తెలిపారు. విద్యార్థిని ఐటీఐ డిప్యూటీ ట్రైనింగ్ ఆఫీసర్ కిరణ్, తదితరులు అభినందించారు.

ఆర్చరీలో భీమవరం క్రీడాకారిణికి రజిత పతకం


రజిత పతకం సాధించిన క్రీడాకారులు

భీమవరం టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : ఉత్తరాఖండ్‌లో 38వ జాతీయ క్రీడల్లో భాగంగా ఈనెల 1 నుంచి 7 వరకు జరిగిన విలు విద్య పోటీలో భీమవరం క్రీడాకారిణికి రజిత పతకం లభించింది. ఆంధ్రప్రదేశ్ జట్టులో పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణానికి చెందిన మాదాల సూర్య హంసినీ, నెల్లూరుకు చెందిన టి..గణేష్ మణిరత్నంకు మిక్స్‌డ్ పోటీల్లో పతకాన్ని కైవసం చేసుకున్నారు.

బ్యాడ్మింటన్‌లో గూట్లపాడు యువకునికి గోల్డ్ మెడల్


రామాయణం దుర్గారావుని అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

భీమవరం రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : యువత క్రీడల్లో రాణించి జిల్లాకు కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జనవరి 27 నుంచి 30 వరకు రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో నిర్వహించిన ఎస్‌బికెఎఫ్ 11వ జాతీయ పోటీల్లో షటిల్ బ్యాడ్మింటన్ విభాగంలో భీమవరం మండలం గూట్లపాడు గ్రామానికి చెందిన రామాయణం దుర్గారావు గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. కలెక్టరేట్ ఛాంబర్‌లో కలెక్టర్ నాగరాణిని దుర్గారావు తల్లిదండ్రులతో వెళ్లి కలిశారు. దుర్గారావును స్ఫూర్తిగా తీసుకుని జిల్లాలోని యువత క్రీడల్లో రాణించాలని కలెక్టర్ అన్నారు.


క్యాంపస్ సెలక్షన్స్‌లో ఎంపికైన ట్రిపుల్ ఐటీ విద్యార్థులతో డైరెక్టర్ అమరేంద్రకుమార్

క్యాంపస్ సెలక్షన్స్‌లో 46 మంది విద్యార్థుల ఎంపిక

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో మొత్తం 46 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్ తెలిపారు. ఇన్ఫోసిస్ సంస్థలో 25 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా, 22 మంది ఎంపికయ్యారన్నారు. సీఎస్ఈ నుంచి 20 మంది ఎంపికవగా, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగం నుంచి ఇద్దరు ఎంపికయ్యారు. హెటిరో డ్రగ్స్ సంస్థకు కెమికల్ ఇంజనీరింగ్ నుంచి 18 మంది జూనియర్ ఇంజనీర్లుగా ఎంపికయ్యారని, శ్రీకరా కన్‌స్ట్రక్షన్స్‌లో ఆరుగురు సివిల్ ఇంజనీరింగ్ నుంచి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను ఆయన అభినందించారు. ఆయా విభాగాల హెచ్‌వోడీలు, అకడమిక్స్ డీన్ డాక్టర్ చిరంజీవి పాల్గొన్నారు.

22 నుంచి గరికపాటి నాటకోత్సవాలు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గరికపాటి ఆర్ట్ థియేటర్ 274 కార్యక్రమంలో భాగంగా ఈనెల 22, 23 తేదీల్లో రెండు రోజుల పాటు ఏలూరు వైఎమ్‌హెచ్‌ఏ ప్రాంగ ణంలో గరికపాటి నాటకోత్సవాలు నిర్వహి స్తున్నట్లు అధ్యక్షుడు గరికపాటి కాళిదాసు ఒక ప్రకటనలో తెలిపారు. 22న సాయంత్రం "అనూ హ్యం, మరీ అంతవద్దు, 23న నేనేం చేసు కుంటాను, సారీ రాంగ్ నంబర్, ఎడారిలో వాన చినుకు" నాటిక ప్రదర్శనలు ఏర్పాటు చేసి నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి సినీ విజ్ఞాన విశారద ఎస్వీ రామారావు, యువ కళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ, పలువురు ప్రముఖులు విచ్చేస్తారని తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటల నుంచి నాటిక పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. కళాభిమానులు పాల్గొని నాటక ప్రదర్శనలను తిలకించాలని కోరారు.

రేపటి నుంచి గోస్తనీ నది 94వ తీర్థోత్సవాలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు కృష్ణంరాజు, సతీమణి మాధవి

పాలకోడేరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మోగల్లు శివారు పాలకోడేరులో ఈ నెల 7వ తేదీ నుంచి 94వ తీర్థ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు గోస్తనీ నది తీర్థోత్సవ ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు గాదిరాజు కృష్ణంరాజు (బాబు) తెలిపారు.తీర్థోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పాలకోడేరులో తీర్థ ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. దక్షిణ మరో కాశీగా భావించే గోస్తనీ నది ఒడ్డున ఉన్న వెంకటేశ్వర స్వామి, రామాలయం ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభిస్తామన్నారు.మూడు రోజులపాటు చిన్నారులతోపాటు పెద్దలకు ఆహ్లాదం కలిగించే అనేక వినోద కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.



ఆకట్టుకున్న సత్య హరిశ్చంద్ర..

భీమవరం టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ వార్షిక ఉత్సవాల్లో భాగంగా బుధవారం మావుళ్ళమ్మ నాట్యమండలి ఆధ్వర్యంలో ప్రదర్శించిన సత్య హరిశ్చంద్ర నాటకం ఆకట్టుకుంది. హరిశ్చంద్రులుగా బద్వేల్ కిరణ్, కావలి సుబ్బరావు, మినిగళ్ళ సుధాకర్‌లు తమ నటనతో అభిమానులను అలరించారు. 1వ చంద్రమతిగా వీరమణి, రెండో చంద్రమతిగా నెల్లూరు భాను నటించారు. సాయంత్రం 4 గంటలకు తులసీ మాత భగవద్గీత ప్రచార పీఠం అల్లిపల్లి వారిచే భగవద్గీత ప్రవచనాలు, సాయంత్రం 5 గంటలకు సత్యకృష్ణ కూచిపూడి కళానిలయం కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. రాత్రి 7 గంటలకు కాళ్ళకూరుకు చెందిన రఘు ఇంద్రజాల ప్రదర్శన ఆకట్టుకుంది.

జగన్మాతగా అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి



దెందులూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : గాలా యగూడెం గ్రామదేవత అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాల సందర్భంగా రెండో రోజు జగన్మాతగా (కుంకుమ అలంకరణ) భక్తులకు దర్శనం ఇచ్చారు ఏలూరు మేయర్ షేక్‌నూర్జహాన్, పెదబాబు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా కళావేదికపై నిర్వహించిన కూచిపూడి నృత్యం, కోలాట భజనలు ఆకట్టుకున్నాయి..

అన్నదాతకు అండగా..


ఆగిరిపల్లి మండలం సగ్గూరులో ప్రయోగాత్మకంగా డ్రోన్ ద్వారా మందుల పిచికారీ (ఫైల్)

రైతుల సేవలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన ఏలూరు జిల్లా

ప్రభుత్వ పథకాలు రైతులకు అందేలా వ్యవసాయ శాఖ చర్యలు

సాగులో నూతన యాంత్రీకరణ పద్ధతులకు శ్రీకారం

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

సిబ్బంది కృషికి ప్రశంసలు

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రైతుల క్షేమం కోసం కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుని రాష్ట్రంలోనే ఏలూరు జిల్లా ప్రథమ స్థానంలో ఉండేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు పూర్తి స్థాయి సహకారాన్ని వ్యవసాయ శాఖాధికారులు, సిబ్బంది అందిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులు పంటను కాపాడు కోవడానికి సూచనలు చేయడంతో పాటు పంట నష్ట పోయిన సమయంలో వారికి నష్టపరిహారం త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకుం టున్నారు. జిల్లా వ్యవసాయ శాఖ రైతులకు అందిస్తున్న సేవలను పరిశీలిద్దాం.

• పొలం పిలుస్తోంది..

సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కలిగించేందుకు వ్యవసాయ శాఖ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. వ్యవసాయ , అనుబంధ శాఖల అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో జిల్లాలో ప్రతీ మంగళ, బుధవారాల్లో ఈ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని మండలాల్లోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తూ పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులను వినియోగించడం ద్వారా అధికదిగుబడిని సాధించడంలో తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. భూసార పరీక్షలను రైతులకు అందించి, సూక్ష్మపోషకాల లోపాలను గుర్తించి మోతాదుకు మించి ఎరువుల వినియోగాన్ని , సాగులో ఖర్చును నియంత్రించటానికి చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో ఇంతవరకు 22,400 మంది రైతులకు భూసార పత్రాలను వ్యవసాయ శాఖ అందించింది.

• ప్రకృతి వ్యవసాయం

రసాయనిక ఎరువులు లేని ఆహార ఉత్పత్తులను అందించడమే ప్రకృతి వ్యవసాయం ముఖ్య ఉద్దేశ్యంగా పేర్కొవచ్చు. ఆ దిశగా రైతులను వ్యవసాయ శాఖ ప్రోత్సహిస్తోంది. జిల్లాలో 42,381 మంది రైతులు 40,875 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తూ రాష్ట్రంలో జిల్లా అగ్రస్థానంలో నిలిచింది.

• పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

50 శాతం రాయితీపై 9,995 క్వింటాళ్ల జీలుగు, జనుము ,పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు అందించి రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లాలోని గిరిజన రైతులకు ఈ విత్తనాలను 90శాతం రాయితీపై అందిస్తున్నారు.

• సాగులో డ్రోన్స్ వినియోగం

సాగులో యాంత్రీకరణ ద్వారా సమయంతో పాటు ఖర్చును నియంత్రించవచ్చు. వరి నాటు యంత్రాలు, వరి కొత్త యంత్రాలతో పాటు డ్రోన్స్ వినియోగంలో ఏలూరు జిల్లా అగ్ర స్థానంలో నిలిచింది. జిల్లాలో 80 శాతం రాయితీపై 40 డ్రోన్లను అధికారులు రైతులకు మంజూరు చేశారు.

• ఆర్థిక భరోసా

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని రైతాంగానికి రూ.4,435 కోట్లు పంట రుణాలుగా అందించారు. పీఎం కిసాన్ పథకం కింద లక్షా 32 వేల మంది రైతులకు రూ.27.04 కోట్లు ఆర్థిక సాయాన్ని అందించారు. 65,147 మంది కౌలు రైతులకు రుణ అర్హత కార్డులను మంజూరు చేసి రూ.142.85 కోట్లను పంట రుణాలుగా అందించారు.

• పంటనష్ట పరిహారం పంపిణీ

2024 సెప్టెంబరులో సంభవించిన తుఫాన్, వర్షాల కారణంగా రైతులు పంట నష్టపోయారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారి ఆదేశాల మేరకు ఆ సమయంలో పంట నష్టపోయిన రైతాంగానికి వారం రోజుల్లోనే 11,782 మంది రైతులకు రూ.14.44 కోట్లను పరి హారంగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు.

• మార్కెటింగ్ సౌకర్యం

పంటను పండించడం ఒక ఎత్తు అయితే పండిన పంటకు గిట్టుబాటు ధర లభించడం రైతులకు సవాల్ అని చెప్పవచ్చు. రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను జిల్లాలోని 228 రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేశారు. ఖరీఫ్‌లో 43వేల మంది రైతుల నుంచి 3లక్షల 43 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి, రూ.790 కోట్లను 24 గంటల్లోగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేసి రాష్ట్రంలో ఏలూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది.

• యాప్‌ల ద్వారా సాంకేతిక పరిజ్ఞానం

రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో కలిసి (ఎన్‌పీఎస్ఎస్ అండ్ ఏపీఎస్ఎస్ యాప్‌ల ద్వారా) ఈ సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందించారు. యాప్‌ల వినియోగంలోను జిల్లా గణనీయమైన ప్రగతి సాధించింది. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి ఇస్తున్న ప్రాధాన్యత , జిల్లా యంత్రాంగం సూచనలతో వ్యవసాయ శాఖ రైతు సంక్షేమానికి చేస్తున్న కృషికి ఏలూరు జిల్లా వ్యవసాయ రంగంలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని చెబుతున్నారు.



అన్ని విభాగాల్లో రాష్ట్రంలో ప్రథమ స్థానం

హబీబ్ బాషా,జిల్లా వ్యవసాయ శాఖాధికారి



వ్యవసాయ శాఖకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని కార్యక్రమాల్లో జిల్లాలోని అన్ని విభాగాల్లో ఏలూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది.పచ్చిరొట్ట ఎరువుల పంపిణీ, కౌలు రుణ అర్హత కార్డులు పంపిణీ, కౌలు రైతులకు రుణాలు పంపిణీ, భూసార పరీక్షలు నిర్వహణలో రాష్ట్రంలో జిల్లా అగ్రగామిగా నిలిచింది. ఇక ప్రకృతి వ్యవసాయంలో జిల్లాకు ప్రత్యేక గుర్తింపు లభించింది. జిల్లాలోని ద్వారకా తిరుమలకు చెందిన రైతు ఒబిలిశెట్టి గోపాలకృష్ణమూర్తికి ఇటీవల బెంగుళూరులో ప్రకృతి వ్యవసాయంలో విశేష ప్రగతి సాధించినందుకు అవార్డు అందజేశారు. అంతర్జాతీయ యోగ్యతా కేంద్రం జైవిక్ ఇండియా అవార్డు-2025ను ప్రకృతి సేద్యంలో చేస్తున్న కృషికి ఆయనకు అందజేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్నారు. ఏపీఎస్ఎస్ యాప్ వినియోగం విషయంలో జిల్లా రాష్ట్రంలో ప్రథమస్థానం లభించింది. రైతులకు అన్ని విధాలా మేలు చేయడానికి, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నేక పథకాలను అమలు చేస్తోంది.ఈ పథకాల అమలులో క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖాధికారులు, సిబ్బంది చేస్తున్న కృషి ప్రశంసనీయం.

పైసా వసూల్..!





డీసీసీబీ రుణాల రికవరీలో వేగం

ముందస్తుగా రంగంలోకి అధికారులు

నష్టాల నుంచి గట్టెక్కించేందుకు కసరత్తు

ఉమ్మడి జిల్లాల్లో రూ.20 కోట్ల పైబడి వసూళ్లు

ఏలూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) :జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్)ల్లో రైతుల నుంచి రుణాల రికవరీ ఆశాజనకంగా జరుగుతుండటంతో డీసీసీబీ అధికార యంత్రాంగం జోష్‌లో ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రుణాలు వసూళ్లను పక్కాగా జమచేయడంపైనే దృష్టిని కేంద్రీకరించింది. ఏలూరు జిల్లాలో 2,50,465 మంది రైతులు ఎస్టీ, ఎల్‌టీ రుణాల కింద రూ.228.03 కోట్ల రుణాలు తీసుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 3,40,233 మంది రైతులు ఎస్టీ, ఎల్‌టీ రుణాల కింద రూ.110.19 కోట్ల రుణాలను ఆయా పీఏసీఎస్‌ల ద్వారా స్వీకరించారు. ఇందులో రెండు జిల్లాల నుంచి రూ. 20.62 కోట్ల వసూళ్ల పురోగతి సాధించారు. ఇందులో కొంత పాత బకాయిలను కూడా వసూలు చేశారు.

నెల రోజుల ముందునుంచే..

ఈ ఏడాది నెల రోజుల ముందే అధికారులు ముందడగు వేశారు. మంచి ఫలితం ఇవ్వడంతో ఇక తగ్గేదేలే అంటూ మార్చి నెలాఖరు నాటికి పూర్తిస్థాయి రుణాల రికవరీకి పరుగులు పెడుతున్నారు. గత వైసీపీ పాలనలో జరిగిన అవినీతి, అక్రమంగా రుణాల అందజేతతో రూ.96 కోట్ల మేర నష్టాల్లో కూరుకుపోయింది. గతమెంతో ఘనంగా జిల్లా కేంద్ర సహకార కేంద్రం బ్యాంకు (డీసీసీబీ) రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఉత్తమ పనితీరుకు జిల్లా నిదర్శనంగా నిలిచి పలు జాతీయ, అంతర్జాతీయ అవా ర్డులను సైతం నాబార్డు నుంచి అందుకున్న దాఖలాలున్నాయి. గత ఐదేళ్లలో దారుణాలు చోటు చేసుకోవడం సహకార సంఘాల వ్యవస్థ మనుగడే ప్రమాదంలో పడింది. దీంతో జిల్లా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు రాష్ట్ర కేంద్ర సహకార బ్యాంకు (ఆప్కాబ్) నుంచి డీజీఎం కేడర్‌లోని అధికారి ఎస్ఆర్‌జీ తిలక్ గతేడాది మధ్యలో డీసీసీబీ సీఈవోగా కూటమి ప్రభుత్వం నియమించడంతో పరిస్థితులు చక్క బడుతున్నాయి. రుణాల రికవరీకి ఏటా ఫిబ్రవరి రెండో వారంలో క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది వెళ్లి టాంటాం ద్వారా వసూ ళ్లకు దిగితే అతి కష్టం మీద రుణాలు వసూలయ్యేవి. ఈసారి ముందస్తుగా సంక్రాంతి వెళ్లిన వెంటనే రైతులను కలిసి బకాయిలపై అవగాహన కల్పించడంతో వారు సాను కూలంగా స్పందించారు.

చెల్లించకపోతే 2 శాతం పెనాల్టీ

ఏలూరు జిల్లాలో డీసీసీబీ జీఎం మాధవీ మూర్తి, పశ్చిమగోదావరి జిల్లాలో జీఎం శ్రీనివాస్‌ల జిల్లా మోనటరింగ్ అధికారులుగా రుణాల వసూళ్లను పర్యవేక్షణ చేస్తున్నారు. డివిజనల్ స్థాయిలో ఏలూరుకు ఇద్దరు, జంగారెడ్డిగూడేనికి 2, పశ్చిమగోదావరిలో భీమవరం, నర్సాపురంలో ఒక్కొక్కరు సీనియర్ సిబ్బందితో రుణాల రికవరీని వేగవంతంగా చేస్తున్నారు. మార్చి నెలాఖరులోగా రుణాలు చెల్లించకపోతే 2 శాతం అపరాధ రుసుం విధించనున్నట్టు రైతులకు వివరిస్తున్నారు. దీర్ఘకాలిక రుణాలపై వాయిదాలను వసూలు చేసేలా అవగాహన కల్పిస్తున్నారు. ఇక ముందు కూడా ఇదే రీతిన వసూళ్లకు సిద్ధపడనుండటంతో డీసీసీబీ పరిపాలన పరంగా ముందంజలో వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ



ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది రుణాల వసూళ్ల పురోగతి బేషుగ్గా ఉంది. ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో రూ.20 కోట్ల పైమాటే రుణాల రికవరీ జరిగింది. గడిచిన జనవరి నెలాఖరు నాటికి బ్యాంకు రూ.23 కోట్ల లాభాల స్థితికి చేర్చామన్నారు. సమిష్టిగా అందరి సహకారంతో రుణాలను వంద శాతం వసూలు చేస్తాం. జిల్లా అధికారులు, బ్యాంకు సిబ్బంది సహకారం క్షేత్రస్థాయిలో బాగుంది.

- డీసీసీబీ సీఈవో ఎస్ఆర్‌జీ తిలక్

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం


గరుడ పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం

అంతర్వేది, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది కల్యాణోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 4 గంటలకు అంతర్వేది పాలెం వాస్తవ్యులు రుద్రరాజు బంగారమ్మ వారిచే నిర్మితమైన గురుడ పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరిపారు. తొలుత స్వామివారిని అర్చక స్వాములు అలంకరణ చేశారు. గ్రామ పురవీధుల్లో స్వామి-అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ఛైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కుమార రామగోపాల రాజా బహద్దూర్, సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఉత్సవ కమిటీ ఛైర్మన్ దిరిశాల బాలాజీ, అమలాపురం ఆర్డీవో కె.మాధవి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవాల్లో నేడు..

కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటల నుంచి 7 గంటల వరకు స్వామివారి తిరువారాధన, అర్జిత అభిషేకం, బాలభోగం, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సుదర్శన హోమం, సాయంత్రం 4 గంటలకు హంసవాహన సేవ, సాయంత్రం 6.30 గంటలకు ధ్వజారోహణ, రాత్రి 7 గంటలకు శేషవాహనంపై గ్రామోత్సవాలు జరుగుతాయని సహాయ కమిషనర్ తెలిపారు.

కట్టుదిట్టమైన భద్రతా చర్యలు

ఐజీ అశోక్‌కుమార్

ఆలయానికి ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ బుధవారం విచ్చేశారు. ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులచే మహదాశీర్వచనం స్వీకరించారు. అనంతరం కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరు బయట కల్యాణం అంతర్వేది పుణ్యక్షేత్రంలో జరుగుతున్నందున 1600 మంది పోలీసు యంత్రాంగం శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రధానంగా కల్యాణం, రథోత్సవం, చక్రస్నానం, స్వామివారి తెప్పోత్సవాల్లో ఎటువంటి తొక్కిసలాట జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లకుకు పోలీసు యంత్రాంగం సన్నద్ధమైందన్నారు. కమాండ్ కంట్రోల్ రూము, వంద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు తీర్థ మహోత్సవాల పర్యవేక్షణ జరుగుతుందన్నారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావుతో కలిసి కల్యాణ మండపం, భక్తుల దర్శన క్యూలైన్, రథం రోడ్డు, పార్కింగ్ తదితర ప్రదేశాలను పరిశీలించి పలు సూచనలు అందించారు. అనంతరం కల్యాణ మండపం వద్ద ఎంతమంది భక్తులు కల్యాణాన్ని తిలకించేందుకు టిక్కెట్లు కేటాయించారని ఆలయ అధికారులను అడగ్గా సూపరింటెండెంట్ పి.విజయసారథి మాట్లాడుతూ 1500 టిక్కెట్లను సాధారణ భక్తుల కోసం అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. వన్‌వే రూటు, రవాణా సౌకర్యం, ఎల్ఈడీ స్క్రీన్లు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. కొత్తపేట డీఎస్పీ మురళీమోహన్, సీఐలు నరేష్ కుమార్, భీమరాజు,ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


కల్యాణోత్సవ ఏర్పాట్లపై వివరాలు తెలుసుకుంటున్న ఐజీ అశోక్‌కుమార్


రథోత్సవంలో పాల్గొన్న మంత్రి పార్థసారథి

కన్నుల పండువగా శోభనాచలుని రథోత్సవం

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గోవిందా.. గోవిందా.. అంటూ భక్తుల నామస్మరణల నడుమ బుధవారం ఆగిరిపల్లిలో శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. మంత్రి కొలుసు పార్థసారథి కుంభం పోసి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథోత్సవంలో దాదాపు నాలుగు గంటల పాటు మంత్రి పాల్గొన్నారు. మహిళలు, యువ కులు రథాన్ని ముందుకు లాగారు. రథంపై అధిరోహించిన స్వామి వారిని దర్శించుకుని భక్తజనం పులకించారు. గ్రామంలోని నాలుగు మాడ వీధుల్లో దాదాపు ఐదు గంటల పాటు ఈ రథోత్సవం జరిగింది. మేళ తాళాలు, కోలాట భజనలు, బేతాళ నృత్యం, తీన్‌మార్ డప్పు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆలయ అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంతకృష్ణ రథంపై స్వామివారిని అలంకరించారు.



ఉద్యాన విశ్వవిద్యాలయంలో సుదీర్ఘకాలం ఇన్‌చార్జ్ అధికారులే ఉన్నారు. కేంద్ర నిధులతో ప్రాజెక్టులు, పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విశ్వవిద్యాలయ పరిధిలో 26 కొత్త వంగడాలు ఒకేసారి విడుదల చేసి రికార్డు నెలకొల్పారు. అటువంటి విశ్వవిద్యాలయంలో ఫర్నిచర్ వ్యవహారంపై రచ్చ సాగుతోంది. దాదాపు కోటి రూపాయల ఫర్నిచర్ మాయం కావడం చర్చనీయాంశంగా మారింది.

లెక్క తేలేనా..?

- ఫర్నిచర్ మాయంపై కమిటీ
- మహిళా ఉద్యోగిని బలి చేసే ప్రయత్నం?
- కొనుగోలు చేసింది ఎవరు?..
- బడ్జెట్ కేటాయించింది ఎవరు?

ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రక్షాళన



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రతిష్ఠ మసకబారింది. పనితీరులో రికార్డులు నెలకొల్పినా పరిపాలనలో అవకతవకలు మచ్చగా మిగిలాయి. కోటి రూపాయల విలువైన ఫర్నిచర్ వ్యవహారంపై అధికారులు లెక్క తేల్చడానికి సిద్ధమయ్యారు. రికార్డు అసిస్టెంట్ స్థాయిలో ఓ మహిళా ఉద్యోగిని స్టోర్ రూమ్‌కు బాధ్యత వహించారు. ఇటీవల ఆమె బదిలీపై వేరే విభాగానికి వెళ్లారు. కొత్తగా స్టోర్‌కు బదిలీ అయిన ఉద్యోగి తనకు ఫర్నీచర్ మొత్తం క్షేత్రస్థాయిలో అప్పగిస్తేనే బాధ్యతలు తీసుకుంటానని స్పష్టం చేశారు. దాంతో ప్రతి విభాగానికి వెళ్లి పరిశీలించారు. రికార్డుల్లో ఉన్న వివరాలకు, కార్యాలయాల్లో ఫర్నిచర్‌కు పొంతన లేదు. దీనితో మహిళా ఉద్యోగిని వేతనం కూడా నిలిపివేసినా తాత్కాలికంగా మళ్లీ మంజూరు చేస్తున్నారు. ఫర్నిచర్ వ్యవహారాన్ని నిగ్గు తేల్చేందుకు త్రిసభ్య కమిటీ పరిశీలన చేస్తోంది. 15 రోజుల వ్యవధిలోనే నివేదిక ఇవ్వాలని వైస్‌చాన్సలర్ బి.గోపాల ఆదేశించారు. తమ విభాగాల్లో పనులు చేసుకుంటూ ఫర్నిచర్‌పై వివరాలు సేకరించాలి. దాంతో కమిటీ నివేదిక ఇవ్వడానికి జాప్యం జరుగుతోంది.

రికవరీకి అధికారుల ప్రయత్నం

గతంలో స్టోర్ విభాగానికి బాధ్యత వహించిన మహిళా ఉద్యోగిని భర్తను కోల్పోవడంతో ఆ కోటాలోనే ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఉద్యోగం పొందారు. అంతకు ముందు స్టోర్ బాధ్యత వహించిన ఉద్యోగి బదిలీపై రాయలసీమ వెళ్లిపోయారు. అప్పట్లో ఎటువంటి పరిశీలన లేకుండానే రికార్డుల్లో ఉన్న వివరాలతో ఫర్నిచర్‌ను మహిళా ఉద్యోగికి అప్పగించారు. తీరా ఆమెను మరో విభాగానికి బదిలీ చేసి వేరొకరికి బాధ్యతలు అప్పగించారు. ఆయన మాత్రం తనకు ఫర్నిచర్ అప్పగిస్తేనే బాధ్యతలు తీసుకుంటానని తేల్చిచెప్పారు. దాంతో ప్రతి విభాగం, కార్యాలయంలో తనిఖీలు చేశారు. కొంత ఫర్నీచర్ కానరాలేదు. దాని విలువ దాదాపు కోటి రూపాయలు ఉంటుందని ప్రచారం సాగింది. మరోసారి అదే ఫర్నిచర్ విలువ రూ.3 కోట్లు ఉంటుందని చర్చ జరిగింది. ఫర్నిచర్ వ్యవహారాన్ని నిగ్గు తేల్చేందుకు త్రిసభ్య కమిటీని వేశారు. విశ్వవిద్యాలయం ఏర్పడినప్పటి నుంచి వాస్తవ పరిశీలన లేకుండా రికార్డులలోనే నమోదు చేస్తున్నారు. స్టోర్ బాధ్యతను తీసుకున్నవారు కూడా రికార్డులనే చూస్తున్నారు. తీరా క్షేత్ర స్థాయిలోనూ ఫర్నీచర్ అప్పగిస్తేనే బాధ్యతను తీసుకుంటామని తాజా ఉద్యోగి చెప్పడంతో మొత్తం వ్యవహారం బయట పడింది.

బడ్జెట్ కేటాయించింది ఎవరు?

వాస్తవానికి ఫర్నిచర్ కొనుగోలు, బడ్జెట్ కేటాయింపులు స్టోర్‌కు బాధ్యత వహించిన వారికి సంబంధం ఉండదు. అధికారుల బడ్జెట్ కేటాయింపులతో ఫర్నిచర్ కొనుగోలు చేస్తారు. ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని కళాశాలలకు, పరిశోధనా స్థానాలకు సరఫరా చేస్తారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యాన విశ్వవిద్యాలయం ఉన్నప్పటి నుంచి ఇదే విధానం అమలు జరుగుతోంది. కేవలం సమాచారం ఇవ్వడంతోపాటు, ఫర్నిచర్ అందినట్టు అంగీకార పత్రాన్ని స్టోర్ బాధ్యులు తీసుకుంటారు. విశ్వవిద్యాలయం ఏర్పడినప్పటి నుంచి అధికారులు దీనిపై పెద్దగా దృష్టి పెట్టలేదు. తాజాగా కొంత ఫర్నిచర్ లేదని తేలడంతో త్రిసభ్య కమిటీ రంగంలోకి దిగింది. పాడైన కుర్చీలు, ఏసీలు ఉంటే విడిచి పెడుతున్నారు. అదే బీరువాలు కనపించకపోతే సంబంధిత శాఖల నుంచి రికవరీ పెడుతున్నారు. ఇంకా తేలనట్టయితే మహిళా ఉద్యోగిని వద్ద రికవరీ చేస్తామంటూ వైస్ ఛాన్సలర్ బి.గోపాల్ తెలిపారు. ఉద్యాన విశ్వవిద్యాలయంలోని వివిధ శాఖల్లో ఫర్నిచర్ మాయమైతే వారే బాధ్యత వహించాలి. అలా కాకుండా ఇప్పుడంతా స్టోర్‌కు బాధ్యత వహించే మహిళా ఉద్యోగికి బాధ్యుని చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఫర్నిచర్ కేటాయింపులు, కొనుగోళ్లు, బడ్జెట్ కేటాయింపులతో రికార్డు అసిస్టెంట్ స్థాయి ఉద్యోగికి సంబంధం ఉండదు, కేవలం ఫర్నిచర్ వివరాలను మాత్రమే నమోదు చేస్తారు.

ఎవరి బాధ్యత వారిదే..!

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యాన విశ్వ విద్యాలయాన్ని గాడినపెట్టే ప్రయత్నాలు చేపట్టారు. వివిధ విభాగాల్లో ఇన్‌చార్జిలను తప్పించి రెగ్యులర్ అధికారులను నియమించారు. సీనియర్ అధికారిని ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్‌గా నియమించారు. నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మరోవైపు అన్ని విభాగాలను ఒక క్రమపద్ధతిలో నడిచేలా చర్యలు తీసుకుంటోంది. ఫర్నిచర్ విషయంలో కూడా సంబంధిత విభాగాలే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఫర్నిచర్ అదృశ్యమైతే సంబంధిత విభాగాధిపతి బాధ్యత వహించాలని, వారి నుంచే రికవరీ చేయాల్సి ఉంటుంది. ఇలా విశ్వ విద్యాలయంలో తాజా నిర్ణయం తీసుకున్నారు. మొత్తంపైన ఫర్నిచర్ కానరాకపోవడంపై నిజాలను నిగ్గు తేల్చే పనిలో కమిటీ నిమగ్నమైంది. రికవరీకి అధికారులు సిద్ధమవుతున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు మూడు నామినేషన్లు దాఖలు

ఏలూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమ గోదావరి ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిలకు బుధవారం ఒక నామినేషన్ దాఖలైంది. ఇప్పటికి మొత్తం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఏలూరు జిల్లా భీమడోలుకు చెందిన గుండుమోలు బాలాజీ బుధవారం కలెక్టరేట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ నెల 10 వరకు నామినేషన్ల దాఖలుకు గడువు ఉంది. ఈ నెల 6, 7,1 0 తేదీలే అభ్యర్థులకు మిగిలాయి. 8,9 తేదీలు సెలవు దినాలు కావడంతో నామినేషన్ల దాఖలకు మూడు రోజులే ఉన్నాయి. ప్రధాన పార్టీల మద్దతున్న అభ్యర్థులు ఇంకా నామినేషన్లు దాఖలు చేయలేదు. వారు నామినేషన్ల వేస్తే రాజకీయ వేడి రగలనుంది.

ఆస్పత్రి నుంచి చిన్నారుల డిశ్చార్జి

ఏలూరు బాలల సంరక్షణ కేంద్రానికి తరలింపు

చిత్రహింసలపై బాల బాలికలను ఆరా తీసిన కలెక్టర్

ఏలూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెంలో మారు తండ్రి పవన్ చిత్రహింసలకు గురైన రాహుల్, రేణుకల ఆరోగ్యం కుదుట పడడంతో స్థానిక ఏరియా ఆసుపత్రి నుంచి బుధవారం డిశ్చార్జి చేశారు. ఆర్డీవో ఎంవీ.రమణ, ఇతర అధికారుల సమక్షంలో ఎస్ఐ ఎస్‌కె.జబీర్‌కు ఆస్పత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ బేబీ కమల అప్పగించారు. నాలుగు రోజులుగా పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచిన వైద్య సిబ్బంది, ఐసీడీఎస్, పోలీసు సిబ్బందిని అధికారులు అభినందించారు. జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి (డీసీపీవో) సూర్యచక్రవేణి మాట్లాడుతూ చిన్నారులు ఇద్దరినీ ఏలూరులో ప్రభుత్వ బాలల సంరక్షణ కేంద్రంలో ఉంచి చదివిస్తామన్నారు. అనంతరం చిన్నారులను ఆర్డీవో తన కార్యాలయానికి తీసుకువెళ్లి వారితో కాసేపు మాట్లాడి బాగా చదువుకోవాలని సూచించారు. కేక్, బిస్కెట్స్ ఇచ్చి ఐసీడీఎస్ సీడీపీవో ఆధ్వర్యం లో ఏలూరు పంపించారు. కాగా బుధవారం రాత్రి చిన్నారులు ఇద్దరితో కలెక్టర్ వెట్రిసెల్వి తన ఛాంబర్‌లో మాట్లాడి ధైర్యం నింపారు. బాగా చదువుకోవాలని సూచిస్తూ, పెద్దయ్యాక ఏమవుతారని అడిగారు. ఉదయ్ రాహుల్ పోలీస్ అవుతానని, రేణుక డాక్టర్ అవుతానని చెప్పింది. వారి లక్ష్యానికి అనుగుణంగా అందరూ సహకరిస్తారని కలెక్టర్ భరోసా ఇచ్చారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో ద్వారా పిల్లలకు గార్డియన్‌గా పెట్టి బ్యాంకు ఖాతా ఓపెన్ చేయించారు. వీరికి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ద్వారా పునారావాసం ఏర్పాటుచేసి, లైసెన్సు పొందిన చైల్డ్‌కేర్ ఇనిస్టిట్యూషన్‌లో చేర్చాలని ఐసీడీఎస్ పీడీ శారదను ఆదేశించారు. బాలబాలికల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న పీడీ, డీసీహెచ్ఎస్ సూర్యచక్రవేణి, సీడీపీవో బ్యూలాలను కలెక్టర్ అభినందించారు.

ఎంఆర్ఐ మిషన్‌లో మహిళ మృతిపై విచారణ

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గుండెకు పేస్‌మేకర్ అమర్చిన మహిళకు ఏలూరు ఆర్ఆర్ పేట డయాగ్నొస్టిక్ సెంటర్‌లో ఎంఆర్ఐ స్కానింగ్ చేస్తున్న సమయంలో మృతి చెందిన సంఘటనపై వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ పద్మావతి బుధవారం ఆరా తీశారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైన ఈ సంఘటనపై స్పందించిన డీహెచ్ తక్షణమే మహిళ మృతిపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని, వైద్యులు, సిబ్బందితో కూడిన బృందం బుధవారం డయాగ్నొస్టిక్ సెంటర్‌కు వెళ్లి వివరాలను సేకరించారు. డీఎంహెచ్‌వో మాలిని మాట్లాడుతూ 'మహిళ మృతికి కారణాలపై ఇరువైపులా సమగ్ర విచారణ చేస్తాం. మృతురాలి కుటుంబం నుంచి గురువారం వివరాలను సేకరిస్తాం. ఇరువైపులా విచారణపూర్తయ్యాక నివేదికను డీహెచ్‌కు పంపిస్తాం.' అని వివరించారు.

నిర్వాసితుల నుంచి సమస్యల వెల్లువ

కుక్కునూరు గ్రామసభలో 6,564 దరఖాస్తులు



గ్రామసభలో దరఖాస్తులు అందజేస్తున్న నిర్వాసితులు

కుక్కునూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల సమస్యలపై బుధవారం కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. నిర్వాసితుల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. వ్యక్తిగత పరిహారం, భూసమస్యలు, 18 ఏళ్లు నిండిన వారికి పరిహారం, ఇంటి పరిహారం, తదితర సమస్యలపై మండలంలోని 15 పంచాయతీల్లో నిర్వాసితులు భారీగా తరలివచ్చారు. దాదాపు 6564 దరఖాస్తులు అందజేశారు. 41.15, 45.72 కాంటూ రు లెవెల్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం నిర్వాసితులు తరలిరావడం విశేషం. ఐటీడీఏ పీవో రాములు నాయక్ మాట్లాడారు. నిర్వాసితులంతా సమస్యలపై దరఖాస్తు చేసుకుంటే పరిష్కరించేలా చేస్తామన్నారు. ఇది ఇలాఉండగా గ్రామసభ వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు ఉన్న వారు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని వివిధ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం జరిగింది. దీంతో ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు కూడా భారీగా తరలివచ్చి పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవడం జరిగింది.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన ములగలంపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన రావులపల్లి శాంతిరాజు (40) బుధవారం సాయంత్రం ఇంటి వద్ద బాత్ రూంలో స్నానం చేస్తుండగా బాత్‌రూం డోర్‌కు మధ్య ఏర్పాటు చేసిన విద్యుత్ వైరు చేతి వేలికి తగిలి ప్రమాదవశాత్తు షాక్ తగిలి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు అతడిని జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మృతుడు శాంతిరాజుకు భార్య శారద, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూలి పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై పి.నవీన్‌కుమార్ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పదో తరగతి బాలికపై అత్యాచారం

కలిదిండి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బాలికపై ఒక బాలుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. మండలంలోని ఒక జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బాలిక (15)పై అదే స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బాలుడు గత నెల 29న అత్యాచారం చేశాడు. ఇది గమనించిన నలుగురు యువకులు బాలికను బ్లాక్‌మెయిల్ చేయడంతో పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కైకలూరు సీఐ రవికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాల్వ గట్టు కబ్జా



కాల్వ గట్టుపై చెట్టు నరికివేత



ఏలూరు గోదావరి కాల్వపై ఆక్రమణలు

ఏలూరు గోదావరి కాల్వ కబ్జా కోరల్లో చిక్కుకుంది. ఏళ్ల తరబడి ఆక్రమణలతో కాల్వ కుచించుకుపోయి నీటి పారుదలకు ఆటంకం కలుగుతోంది. మరోవైపు జాతీయ రహదారికి సమాంతరంగా ప్రవహిస్తున్న కాల్వ గట్టుపై ఆక్రమణలతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో జాతీయ రహదారిని ఆనుకుని ప్రవహిస్తున్న కాల్వ ఆక్రమణలతో సాగునీటి ఇబ్బందులు, వాహనదారులకు ప్రాణాపాయ పరిస్థితులు నెలకొన్నా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.

- కాల్వ వెంబడి చెట్ల నరికివేత
- షెడ్లు, దుకాణాలు ఏర్పాటు
- నీటి ప్రవాహానికి ఆటంకం
- గట్టును ఆనుకుని రహదారి
- వాహనదారులకు ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

దెందులూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారికి సమాంతరంగా ప్రవహిస్తున్న ఏలూరు (గోదావరి) కాల్వ ఆక్రమణల చెరలో చిక్కుకుంది. కబ్జా పర్వంలో కాల్వ విస్తీర్ణం తగ్గడంతో పాటు చెత్త చెదారం అడ్డుపడి సాగు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు నియోజకవర్గాల పరిధిలోని గుండుగొలను, సత్యనారాయణపురం, ఉండ్రాజవరం, దోసపాడు, కొవ్వలి, దెందులూరు చెక్‌పోస్ట్, ఆశ్రం ఆసుపత్రి పాలగూడెం (మల్కాపురం) పరిధిలోని ప్రధాన గోదావరి, కృష్ణా కాలువ ఆయకట్టులో నీటి కష్టాలు తప్పడం లేదు. కాల్వ గట్టుపై షెడ్లు, దుకాణాల చెత్తతో నీరు కలుషితం అవుతోంది. కాల్వగట్లపై కొంతమంది కూరగాయలు పండిస్తుంటే, మరికొన్ని చోట్ల శాశ్వత కట్టడాలు వెలిశాయి. షాపులు, బడ్డీకొట్లు, సర్వీసింగ్ సెంటర్ల వ్యర్థాలను నేరుగా కాల్వలోకి వదిలేస్తున్నారు. పాత సామన్ల కొనుగోలు, పాతటైర్లు తదితర దుకాణాలు, హోటల్స్ సైతం కాల్వ గట్టుపై వెలిశాయి. దుకాణాలకు వచ్చే వాహనాలతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయి.

లోకాయుక్తకు ఫిర్యాదు

ఉంగుటూరు నియోజకవర్గంలోని నారాయణపురం, చేబ్రోలు, కైకరం భీమడోలు గ్రామల మీదుగా దెందులూరు నియోజకవర్గంలోని గుండుగొలను మీదుగా ప్రవహించే కాల్వ గట్టు ఆక్రమణలపై 2022లో విజయవాడకు చెందిన వ్యక్తి లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఆక్రమణలు తొలగించాలని లోకాయుక్త ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలో 463 ఆక్రమణలను గుర్తించిన రెవెన్యూ, పంచాయతీరాజ్, జలవనరుల శాఖ అధికారులు ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చారు. అనంతరం ఆక్రమణదారులు కూడా హైకోర్టును ఆశ్రయించారు. దెందులూరు మండల పరిధిలో అధికారులు ఆక్రమణలపై చర్యలు తీసుకోలేదు.

చెట్ల నరికివేత

కాల్వ గట్టుపై 50 ఏళ్లనాటి భారీ వృక్షాలను నరికేస్తున్నారు. కొంతమంది దర్జాగా చెట్లను నరికి లారీ, ట్రాక్టర్లపై కలపను తరలిస్తున్నారు దెందులూరు మండలంలో 1987-1988లో వ్యవసాయ కూలీలకు జీవనోపాధికోసం చెట్టు పట్టా పథకంలో గోదావరి కాలువ పక్కన మొక్కలను పెంచుకునేందుకు భూమి కేటాయించింది, దెందులూరు నుంచి కొవ్వలి అడ్డరోడ్డు పక్కన కాల్వ పక్కన ఇటుకల బట్టీ సమీపంలో ఈ భూమలలో పెద్ద మొక్కలు పెరిగాయి. వీటిలో పెద్ద చెట్టును కొంత మంది ఇటీవల నరికి తరలించే ప్రయత్నించగా దెందులూరు గ్రామానికి చెందిన గంజి పార్వతి, గంజి కనకరావులు ఎంపీడీవో, ఇరిగేషన్ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయినప్పటికి చెట్టును నరికి రాత్రికి రాత్రే తరలించుకుపోయారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులు స్పందించి గోదావరి కాల్వ ఆక్రమణలను నిరోధించాలని, కాల్వను పరిరక్షించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

రైల్వే ఆక్రమణ చట్టాన్ని ఇరిగేషన్ స్థలాలకు వర్తింపజేయాలి



రైల్వే స్థలాలను ఆక్రమిస్తే ఏవిధంగా కేసులు నమోదు అవుతాయో అదేవిధంగా ఇరిగేషన్ స్థలాల ఆక్రమణపై కేసులు నమోదు చేసేవిధంగా చట్టం చేయాలి. నెలకు కచ్చితంగా ఒక్కసారైనా గోదావరి కాల్వ ప్రారంభమైన చోట నుంచి శివారు వరకు ఇరిగేషన్ ఈఈ స్థాయి ఉద్యోగి పరిశీలన చేయాలి. దీనితో సాగునీటి చౌర్యం, సమస్యలు పరిష్కారమవుతాయి. అధికారులకు ఆక్రమణలపై అవగాహన వస్తుంది. గ్రామాల్లో మురుగు డ్రెయిన్ల నీరు పంట కాలువలోకి వదులుతున్నారు. వాటిని మురుగుకాల్వలోకి మళ్లించేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే గోదావరి కాల్వ పరిరక్షణ సాధ్యం.

పర్వతనేని రంగారావు నీటి సంఘం అధ్యక్షుడు, సత్యనారాయణపురం

ఇద్దరి దొంగల అరెస్ట్

348 గ్రాముల బంగారం, 5 మోటారు సైకిళ్లు స్వాధీనం





పోలీసుల అదుపులో నిందితురాలు చోరీ సొత్తు వివరాలు చెబుతున్న ఎస్పీ నయీమ్ అస్మి

ఆకివీడు రూరల్ ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బంగారం, మోటారు సైకిళ్ల దొంగలు ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 348 గ్రాముల బంగారం, 5 మోటారు సైకిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పి అద్నాన్ నయీమ్ అస్మి తెలిపారు. అజ్జమూరులోని ఆకివీడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో బుధవారం బంగారం, వాహనాలు, నిందితులను వివరాలు తెలియజేశారు. కాళ్ళ మండలం పెద అమిరంలోని సిల్వర్ స్ప్రింగ్ విల్లాలో ఈనెల 4న దొంగతనం జరిగినట్లు గుర్తించిన యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పనిమనిషిపై అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు ఉండి మండలం మహదేవపట్నం భవానీపురానికి చెందిన బలిరెడ్డి వరలక్ష్మిని అదుపులోనికి తీసుకుని విచారించారు. ఆమె వద్ద దొంగిలించబడ్డ బంగారం 348గ్రాములు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఆకివీడు మండలం చినకాపవరంలో ఫ్రైడ్ షాపు నిర్వహిస్తున్న బైరే వీరాస్వామిని అరెస్టు చేసి 5 మోటారు సైకిల్స్ స్వాధీనం చేసుకునట్లు తెలిపారు. ఫ్రైడ్ షాపు నిర్వహిస్తూ మోటారు సైకిళ్ల దొంగతనానికి పాల్పడుతున్నట్లు ఆయన తెలిపారు. ఇళ్లలో పనిచేస్తున్న పనిమనుషులు, ఇతర పనులు చెయ్యడానికి వచ్చే వారిపై జాగ్రత్తగా ఉండాలని, ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో పోలీసులకు లేదా చుట్టుపక్కల వారికి తెలియజేసి వెళ్ళాలని ఆయన సూచించారు. ఎల్‌హెచ్ఎస్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

24 గంటల్లో కేసు ఛేదించిన సిబ్బందికి ఎస్పీ అభినందన

ఫిర్యాదు అందిన 24గంటల్లో కేసు ఛేదించిన సిబ్బందిని ఎస్పీ నయీం అభినందించారు. డీఎస్పీ జైసూర్య పర్యవేక్షణ, సీఐ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీనివాసరావు, కానిస్టేబుల్స్ ప్రకాష్, విజయ్‌బాబు, మహేశ్వరరావు, దీప్తి పనిమనిషిని అదుపులోనికి కేసు ఛేదించారు. ఈనెల 4న కేసు నమోదు చేసి, 5 సాయంత్రానికి నిందితుడిని అరెస్టుచేసి, చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడం అభినందనీయమన్నారు. సిబ్బందికి రివార్డులు ప్రకటించారు.

స్కూల్ బస్సు ఢీకొని రెండేళ్ల బాలుడి మృతి

అన్నను తీసుకెళ్లడానికి వచ్చిన బస్సు రూపంలో మృత్యువు



ఆస్పత్రిలో బాలుడి మృతదేహం

శ్రీదీక్షిత్ (ఫైల్)

పెదపాడు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పాతముప్పర్రులో రెండేళ్ల బాలుడిని స్కూల్ బస్ ఢీకొనడంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన వలదాసి ఏసుపాదం మనీషా దంపతులకు జోష్, శ్రీదీక్షిత్ (2) ఇద్దరు పిల్లలు ఉన్నారు. జోష్ వంగాయగూడెంలోని ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. పాఠశాల బస్ జయపురం నుంచి పాతముప్పర్రు మీదుగా విద్యార్థులను తీసుకువెళుతుంది. బుధవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో స్కూల్‌బస్ ఇంటి ముందు ఆగింది. తల్లి మనీషా కుమారుడు జోష్‌ను బస్ ఎక్కించింది. ఆ సమయంలో ఇంటి ముందు రోడ్డుపై ఉన్న చిన్న కుమారుడు శ్రీదీక్షిత్‌ను బస్ ఢీకొనడంతో తలకు గాయమై మృతి చెందాడు. ఈ సంఘటనపై తండ్రి ఏసుపాదం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి హెచ్‌సీ సీహెచ్ కృష్ణ దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరణ

యువకుడి ఆత్మహత్య

పెదవేగి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరించడంతో ఒక యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. ముండూరు గ్రామానికి చెందిన రంపా ఇంద్రపవన్, కామవరపుకోట మండలం సాగిపాడు గ్రామానికి చెందిన యువతి కొంతకాలంగా ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుందామని ఇంద్రపవన్ ఆమెను అడిగాడు. ఆమె నిరాకరించడంతో ఈనెల 3న ఇంటిదగ్గర పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో విజయవాడ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్న ఇంద్రపవన్ (23) బుధవారం ఉదయం మృతి చెందాడని ఎస్ఐ చెప్పారు. మృతుని తల్లి మనోహరం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

మద్యం మత్తులో పురుగు మందు తాగేశాడు

లింగపాలెం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో పురుగు మందు తాగిన వ్యక్తి మృతి చెందిన ఘటన లింగపాలెం మండలం అయ్యప్పరాజుగూడెంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భీమడోలు మండలం భీమడోలు గ్రామానికి చెందిన చిన్నబోయిన కొండయ్య 4 నెలలుగా లింగపాలెం మండలం అయ్యప్పరాజుగూడెం గ్రామంలో పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ నెల 4న మద్యం మత్తులో పురుగుమందు తాగి పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య రామవమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి అన్యాయం

చింతలపూడి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో వ్యవయసాయ రంగానికి తీరని అన్యాయం జరిగిందని, నిధుల కేటాయింపు తక్కువ ఇచ్చారంటూ నిరసిస్తూ బడ్జెట్ ప్రతులను ఏపీ రైతు సంఘం, కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో దహనం చేశారు. ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పుల్లూరి సోమ శేఖరాచార్యులు, సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, రైతు సంఘ నాయకులు జె.రామచంద్రారెడ్డి, టి.ప్రకాష్, టి.మాణిక్యాలరావు, ఎం.ఎస్. నారాయణరెడ్డి, టి.బాబు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం

పెదపాడు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): వసంతవాడలోని షిర్డీసాయి దేవాలయ 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన పాఠశాల విద్యార్థినుల కోలాట నృత్యాలు అందరినీ అలరించాయి. ఆలయ కమిటీ నిర్వాహకులు పొలుపర్తి కన్నారావు అన్న సమారాధన ఏర్పాట్లను పర్యవేక్షించారు. వట్లూరులోని కనకమహాలక్ష్మి అమ్మవారి వార్షికోత్సవం ముగింపును పురస్కరించుకుని ఘనంగా అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ అభివృద్ధి, భక్త బృందం సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీఆర్‌ఆర్‌లో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

పెదపాడు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్ సర్‌సీఆర్‌రెడ్డి పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం సైబర్ క్రైం, వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఏలూరు సైబర్‌క్రైం సబ్ ఇన్‌స్పెక్టర్ బి.మధు వెంకట్ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాలో వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని సూ చించారు. ఈ కార్యక్రమంలో సెట్‌వెల్ సీఈవో కోట సూర్యప్రభాకరరావు, వి.వరలక్ష్మి, జాన్ కెనడి, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం అమలు తీరుపై ఎంపీడీవో ఆరా

ఉంగుటూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు మండలంలోని వి.ఎ.పురం, కాగుపాడు హైస్కూళ్లను బుధవారం ఆకస్మికంగా సందర్శించిన ఎంపీడీవో రాజ్ మనోజ్ మధ్యాహ్న భోజన పథకం ఏజన్సీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా కాగుపాడు హైస్కూల్‌ను, అంగన్వాడీ సెంటర్‌ను పరిశీలించి తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. కాగుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యులతో మాట్లాడి మందులు అందుబాటులో ఉన్నాయో లేవో ఆరా తీశారు.

ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయండి

పెదపాడు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని, అప్పుడే ప్రజాస్వామ్య బద్ధమైన సుస్థిర ప్రభుత్వం ఏర్పడుతుందని పెదపాడు తహసీల్దారు కృష్ణ జ్యోతి తెలిపారు. పెదపాడు మండలం వట్లూరులోని సర్.సి.ఆర్.రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 27న జరగనున్న ఎమ్మెల్సీ ఓట్లను ఉద్దేశించి ఓటు హక్కు ప్రాధాన్యం, వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి ప్రిన్సి పాల్ జి.సరళ, విశ్వనాథరావు, ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.

ఐటీఐలో నైపుణ్యాల అభివృద్ధికి స్కిల్ అవర్

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : పోటీ తత్వంతో కూడిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను ఐటీఐ విద్యార్థులు నిరంతరం అప్‌డేట్ అయ్యేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఐటీఐలలో 'స్కిల్ అవర్' పేరిట ప్రతీ బుధవారం ఓ కార్యక్రమానికి ప్రభుత్వం ఇటీవల శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా స్థానిక సత్రంపాడు ప్రభుత్వ ఐటీఐలో క్వాలిటీ అండ్ ప్రొడక్టవిటీ అనే అంశంపై భీమడోలు లిక్విల్ ఇండియా సానిటరీవేర్ తయారీ సంస్థ సేఫ్టీ మేనేజర్ పి.ప్రవీణ్, హెచ్‌ఆర్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడారు..

సీఐఐ బృంద సభ్యులతో కలెక్టర్ సమావేశం

ఏలూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లాకు వచ్చిన సీఐఐ (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ)బృంద సభ్యులతో కలెక్టర్ కె.వెట్రిసెల్వి బుధ వారం సమావేశమయ్యారు. వాతావరణంలో కలిగే మార్పులు, కాలుష్యం, వ్యవసాయం, నీటి నిర్వహణ, ప్రకృతి వైపరీత్యాల వల్ల సంభవించే నష్టాలు తదితర అంశాలపై చర్చించారు. న్యూఢిల్లీ సీఐఐ సెబిర్ కన్సల్టెంట్ డాక్టర్ ఎస్ స్వాతి, డిప్యూటీ డైరెక్టర్ జెస్సీ ఏ ఇనపర్తి, జీసీఆర్‌ఎస్ కన్సల్టెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

హత్యాయత్నం చేసిన వ్యక్తి అరెస్ట్

టి.నరసాపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి):హత్యాయత్నానికి యత్నించిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు. టి.నరసాపురం పంచాయతీలోని చిన్న గురువాయిగూడెం గ్రామానికి చెందిన ఎలమర్తి వెంకటేశ్వరరావు చెల్లెలు వాణి గత 15ఏళ్ళుగా హైదరాబాద్‌లో తన భర్తతో కలిసి నివాసం ఉంటోంది. ఈ నేపథ్యంలో నారాయణ రెడ్డి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో వారి మధ్య విభేదాలు తలెత్తాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ నుంచి గురవాయిగూడెం వచ్చి వెంకటేశ్వరావుపై హత్యాయత్నం చేశాడు. స్థానికులు అడ్డుకోవడంతో ఆ ప్రమాదం నుంచి బయటపడ్డాడు. వెంకటేశ్వరరావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నారాయణ రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు.

పది నెలలుగా ఉపాధ్యాయుడు విధులకు గైర్హాజరు

వేలేరుపాడు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి):వేలేరుపాడు మండలం రుద్రమ్మకోట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మల్లం శ్రీనివాసరావు గతేడాది ఏప్రిల్ నుంచి విధులకు హాజరు కావడం లేదు. ప్రస్తుతం ఆయన ఉన్నారా? ఉంటే ఎక్కడ ఉన్నది తెలియడం లేదని ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. గత ఏడాది సెప్టెంబరు 25న శ్రీనివాస రావుకు షోకాజ్ నోటీసు ఇచ్చినప్పటి నుంచి ఇంత వరకు వివరణ ఇవ్వలేదని తెలిపారు. డీఈవో ఎం.వెంకట లక్ష్మమ్మకు సమాచారం ఇవ్వడంతో ఏపీసీఎస్ డీఎస్సీ (ఏ) 1991 రూల్ 9 ప్రకారం అనధికారికంగా విధులకు గైర్హాజరవుతున్నారని, ఏడు రోజుల్లోగా డీఈవోకు వ్యక్తిగతంగా రిపోర్టు చేయాలని ఆదేశించారు. గడువులోగా అలా చేయకపోతే తదుపరి నోటీసు లేకుండా అతన్ని సర్వీస్ నుంచి తప్పించనున్నట్టు డీఈవో ఒక ప్రకటనలో తెలిపారు.

చిన్నారుల అభివృద్ధిపై సమావేశాలు నిర్వహించాలి

పెదవేగి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): చిన్నారుల గ్రోత్ మోనిటరింగ్ (అభివృద్ధి)పై ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలోనూ తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ పెదపాడు ప్రాజెక్టు అదనపు సీడీపీవో ఎం.సునీల్ రాజశేఖర్ అన్నారు. పెదవేగి మండలం కూచింపూడిలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం బాల్యారంభ సంరక్షణ, విద్యా దినోత్సవం కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల సంక్షేమం, ఆరోగ్య సంరక్షణ అంగన్‌వాడీ కేంద్రాల లక్ష్యమన్నారు. ప్రతినెల 5న సమావేశాలు ఏర్పాటు చేసి, పిల్లల సంరక్షణపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు.

హెల్మెట్ ధరించడంపై శుక్రవారం ప్రత్యేక డ్రైవ్

పెదపాడు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): వాహన ప్రమాదాలను నివారించే చర్యల్లో భాగంగా పెదపాడు మండలం వట్లూరులోని రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల వద్ద శుక్రవారం ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించి ద్విచక్ర వాహనాలను తనిఖీలు చేపడుతున్నట్టు ఉపరవాణా కమిషనర్ షేక్ కరీం తెలిపారు. హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే ఈ తనిఖీల్లో గుర్తిస్తామన్నారు. సురక్షిత ప్రయాణానికి ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు.


మాజీ ఎంపీ మాగంటి బాబు పుట్టిన రోజు వేడుకల దృశ్యం

ఘనంగా మాగంటి బాబు పుట్టినరోజు వేడుక

పెదపాడు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి మాగంటి వెంకటేశ్వరరావు(బాబు) 65వ పుట్టినరోజు వేడుకలు పెదపాడు మండలం అప్పనవీడులోని ఆశాజ్యోతి మానసిక వికలాంగుల పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, కూటమి నాయకులతో కలిసి మానసిక వికలాంగ విద్యార్థుల సమక్షంలో మాగంటి బాబు కేక్ కట్ చేసి అందరికీ అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మాగంటి అభిమానులు, ఆశాజ్యోతి సిబ్బంది పాల్గొన్నారు.


చెరువులో కనిపిస్తున్న కోళ్ల వ్యర్థాలు

మళ్లీ యథేచ్ఛగా కోళ్ల వ్యర్థాల తరలింపు

ఫిర్యాదు మేరకు చెరువు పరిశీలన
నోటీసులు అందజేస్తామన్న అధికారులు

భీమడోలు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : అధికారుల నిఘా కొరవడడంతో కొంత కాలంగా ఆగిన కోళ్ళ వ్యర్థాల రవాణా మళ్ళీ మొదలైంది. గత పది రోజులుగా భీమడోలు శివారు లింగంపాడు ప్రాంతంలో లీజుకు చేస్తున్న సుమారు 40 ఎకరాల చేపల చెరువుకు కోళ్ళ వ్యర్థాలు తరలిపోతున్నాయి. ఒక నాయకుడి చెరువులో గుట్టు చప్పుడు కాకుండా కోళ్ళ వ్యర్థాలను చేపలకు మేతగా వేస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో ఈ వ్యర్థాలను తరలిస్తున్నట్లు సమాచారం. కోళ్ళ వ్యర్థాల రవాణాపై గతంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ, పోలీసు, మత్స్యశాఖ అధికారుల మండల స్థాయి కమిటీ అప్పట్లో ఉక్కుపాదం మోపడంతో రవాణా నిలిచిపోయింది. మళ్ళీ ఇటీవల ఈ రవాణా ప్రారంభం కావడంతో ఈ ప్రాంతంలో ఉండే గ్రామస్తులు వ్యర్థాల దుర్వాసనకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందిన ఫిర్యాదుతో బుధవారం వీఆర్వో ప్రసాద్, మత్స్య శాఖ వీఎఫ్ఏ తదితరులు చెరువులను పరిశీలించి వ్యర్థాలు రవాణా అవుతున్నట్లు నిర్ధారించామని చెరువు యజమానికి నోటీసులు అందజేస్తామని చెప్పారు.

నూతన చట్టాలను రద్దు చేయాలి : సీపీఎం

టి.నరసాపురం/చింతలపూడి, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన కార్మిక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ సీపీఎం ప్రజా సం ఘాల ఆధ్వర్యంలో బుధవారం టి.నరసాపురం అంబేద్కర్ సెంటర్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు జి.వెంకట రావు మాట్లాడుతూ ప్రజా సంపదను కార్పొరేటర్లకు కట్టబెట్టేలా చట్టాలు రూపొందిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చింతలపూడిలోని ఫైర్‌స్టేషన్ సెంటర్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఫైర్ స్టేషన్ సెంటర్‌లో ప్రదర్శన నిర్వహించారు. ఈ నిరసన ప్రదర్శనలో సీపీఐ నాయకులు ఆర్.వి.సత్యనా రాయణ మాట్లాడుతూ కేంద్ర తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను అడ్డుకుంటామని అన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్ళి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ ప్రదర్శనలో కార్మిక సంఘ నాయకులు నత్తా వెంకటేశ్వరరావు, పాండురంగారావు, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు పుష్పరాణి, వర లక్ష్మి, అంగన్‌వాడీ నాయకురాలు సరోజిని, మాణిక్యం పాల్గొన్నారు.



చింతలపూడిలో సీఐటీయూ ఆందోళన

బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు

ఏలూరు కార్పొరేషన్ : కార్మికులు, రైతాంగంపై భారాలు వేసి కార్పొరేటర్ కంపెనీలకు దోచిపెట్టే బడ్జెట్‌గా ఉందంటూ సిఐటియు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో స్థానిక వసంత మహల్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. కార్మిక రైతాంగ వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను అందరూ వ్యతిరేకించాలని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి, కార్మిక సంక్షేమానికి, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బిసోమయ్య, వి.వి.ఎన్. ప్రసాద్, వై.ఎస్.కనకారావు, జె.గోపి, గొట్టాపు రవికిషోర్ పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

కుక్కునూరు : కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వై.సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ప్రధాన సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వై.నాగేంద్రరావు, సురేష్, హరినాథ్, అన్నపూర్ణ, మాధవి పాల్గొన్నారు.

రథ సప్తమి ఉత్సవాల్లో..

మహాపూర్ణాహుతి

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : స్థానిక పవరుపేట స్టేషన్ రోడ్డులోని ధన్వంతరి వైద్య భగవానుని ఆలయం వద్ద జరుగుతున్న రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ ప్రాంగణంలో అర్చకులు, పండితులు సంయుక్తంగా భక్తుల సమక్షంలో మహాపూర్ణాహుతిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత విఘ్నేశ్వరపూజ, స్వామివారికి అభిషేకం నిర్వహించారు. మండపారాధన, మహాసౌరం, సూర్య ధన్వంతరి రుద్ర నవగ్రహ, మృత్యుంజయ ఆరోగ్య హోమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు రాళ్ళబండి ఆదినారాయణశర్మ భక్తులతో పూజలు చేయించారు. వారి గోత్రనామాలతో అర్చనలు జరిపారు. ఆలయ చైర్మన్ కోరాడ రెడ్డి, ఇఓ నెహ్రూలు భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు. అనంతరం రెడ్డి మాట్లాడుతూ బుధవారంతో రథసప్తమి ఉత్సవాలు ముగుస్తాయని, మంగళవారం రాత్రి శ్రీ ఉషాపద్మిని చాయా సమేత శ్రీ సవిత్రు సూర్యనారాయణస్వామివార్ల కళ్యాణ మహోత్సవాన్ని జరిపామని తెలిపారు. గురువారం పవళింపు సేవతో రథసప్తమి ఉత్సవాలు ముగుస్తాయని,ఈ నెల 16వ తేదీన మహా అన్నసమారాధనను ఏర్పాటు చేశామని చెప్పారు. ఆలయ కమిటీ సభ్యులు తోట రమేష్ కుమార్, యర్రంశెట్టి గంగాధరరావు, భారతి శ్రీనివాసరావు, ఘంట రాంబాబు, నర్రా లక్ష్మణ, మట్టా జగదీష్ ఉన్నారు.


మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

నిందితుడి ఆచూకీ తెలపండి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపి ఒక వ్యక్తి మరణానికి కారకుడైన నిందితుడి ఆచూకీ తెలపాలని చిలకలపూడి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్‌నబీ కోరారు. చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో 2014లో నమోదైన కేసులో ఏలూరు రూరల్ మండలం పోణంగి కాలనీకి చెందిన బత్తుల నాగజగన్నాథం(45)పై మచిలీపట్టణం కోర్టులో విచారణ కొనసాగుతోంది. నిందితుడు హాజరుకాకపోవడంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడి ఆచూకీ తెలిసిన వారు చిలకలపూడి సీఐ అబ్దుల్ నబీ(8332983789)కి సమాచారం అందించాలని కోరారు.

పేకాట స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై ద్వారకాతిరుమల పోలీసులు బుధవారం దాడి చేశారు.రాళ్లకుంటలతో నిర్వహించిన ఈ దాడిలో ఏడుగురు జూదరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ.19,400 నగదు, పది బైక్‌లు, 9 సెల్ ఫోన్‌లు, స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

యువకుడి అదృశ్యం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నుంచి బయటకు వెళ్ళిన ఒక యువకుడు తిరిగి రాలేదని పోలీసులకు ఫిర్యాదు అందింది. ఏలూరు ఏనుపాదపురానికి చెందిన నాయుడు వెంకటేష్ (19) జనవరి 15వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్ళి తిరిగి రాలేదు. అతని గురించి ఎంత వెతికినా ఆచూకీ కానరాకపోవడంతో తండ్రి రమణ ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. యువకుని ఆచూకీ తెలిసిన వారు ఏలూరు వన్‌టౌన్ సీఐ(9440796604)కి,ఎస్ఐ(9440796605)కి సమాచారం అందించాలని కోరారు.

క్లాప్ డ్రైవర్ల ఆందోళన

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరంలో ఇంటింటికి చెత్తసేకరించే వాహనాలు (క్లాప్) ఆటోలను మున్సిపల్ అధికారులు ఫిబ్రవరి 1 నుంచి నిలిపివేశారు. ముందస్తు సమాచారం నోటీసులు ఇవ్వకుండా క్లాప్ ఆటోలను నిలుపుదల చేయడం, వాటి పై పనిచేస్తున్న డ్రైవర్లను ఉద్యోగాల నుంచి తొలగించటానికి నిరసనగా క్లాప్ ఆటోల డ్రైవర్లు గత మూడు రోజులుగా ఆందోళన చేస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం క్లాప్ ఆటోల డ్రైవర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో పాత బస్టాండు అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి ప్రదర్శనగా బయల్దేరి ఏలూరు కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా నిర్వ హించారు. డ్రైవర్లను, అధికారులు ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయమని, తక్షణం వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో క్లాప్ ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు ఉన్నారు.

నారాయణపురంలో అన్న సమారాధన

ఉంగుటూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి పక్కన ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహోత్సవాల్లో భాగంగా బుధవారం అన్న సమారాధన నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.దీంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయని ఆలయ కమిటీ పేర్కొంది.

సమస్యలపై అర్జీల స్వీకరణ

పెదవేగి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో బుధవారం వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు సమస్యల పరిష్కారం కోరుతూ వినతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొప్పన సుధాకర్ పాల్గొన్నారు.

పాఠశాలకు వితరణ

నిడమర్రు ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): అడవికొలను ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి హైదరాబాద్‌లో సీఐగా పని చేస్తున్న పోలిశెట్టి సతీష్ 5 వేల రూపాయల విలువైన ఆఫీసు టేబుల్ బహూకరించారు. ఇదే కార్యక్రమంలో 2009-10 పూర్వ విద్యార్థులు సుమారు 12 వేల విలువైన మైక్ సెట్‌ను పాఠశాల హెచ్.ఎం. టి.సుబ్బలక్ష్మికి అందజేశారు.

చెస్ క్రీడాకారుల ప్రతిభ

ఏలూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ఎం.కుశాంక్ శ్రీ విశ్వ, పి.సాధిక్ వర్మ ఇంటర్నేషనల్ క్లాసికల్ చెస్ రేటింగ్ ప్లేయర్లుగా అర్హత సాధించినట్టు దివ్యాస్ మాస్టర్ చెస్ అకాడమీ డైరెక్టర్ అయినపర్తి సరళా మాధవి తెలిపారు. ఇటీవల వైజాగ్‌లో జరిగిన చెస్ టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచారన్నారు. కుశాంక్ 1648 రేటింగ్, సాధిక్ వర్మ 1406 రేటింగ్ సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అకాడమీ డైరెక్టర్ సరళా మాధవి మెమెంటోలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎ.చంద్రశేఖర్ మాస్టారు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సూపర్-6 అమలు చేస్తాం : చంటి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఎన్ని అవంతరాలు ఎదురైన సూపర్ 6అమలు చేస్తామని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి బుధవారం వినతులు స్వీకరించారు.ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ అర్హత కలిగిన పేదలందరికి ఇళ్ళు నిర్మించి ఇస్తామన్నారు. సమస్యలున్నవారు తనను నేరుగా కలిసి వివరించాలని, తానెప్పుడు అందుబాటులోనే ఉంటానని స్పష్టం చేశారు.

మామిడి రైతులను ఆదుకోవాలి

పెదవేగి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : మామిడి రైతులు సరైన ఆదాయం లేక ఇబ్బందులు పడుతున్నారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పెదవేగి, గార్లమడుగు గ్రామాల్లో బుధవారం పర్యటించిన శ్రీనివాస్ మామిడి తోటలను పరిశీలించి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యాన పంటలకు ప్రోత్సాహకాలు అందిస్తామని చెబుతున్నప్పటికీ రైతులకు ఎటువంటి రాయితీలు, ప్రోత్సాహకాలు అందడం లేదని అన్నారు.


మామిడి తోటలను పరిశీలిస్తున్న దృశ్యం

నిత్యాన్నదాన, స్వర్ణమయ పథకానికి విరాళం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల చినవెంకన్న ఆలయంలో నిర్వహిస్తున్న రెండు ట్రస్టుల కు ఓ భక్తుని కుటుంబం బుధవారం రూ.3 లక్షలు విరాళంగా అందజేశారు. రాజమహేంద్రవరానికి చెందిన వి.ఎస్.సుమంత్ కుమార్ ముందుగా నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.2 లక్షలు, విమానగోపుర స్వర్ణమయ పథకానికి రూ.లక్ష వెరసి రూ.3 లక్షలను అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబానికి ఆలయ ఏఈవో పి.నటరాజారావు విరాళం బాండు పత్రాన్ని అందజేశారు. అనంతరం శ్రీవారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.


అందజేస్తున్న విరాళం బాండు

సిబ్బంది విధులను పర్యవేక్షించాలి : కలెక్టర్

ఏలూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి కేటాయించిన విధులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీవో, డీపీవో, ఈవోపీఆర్డీలతో పలు అంశాలపై సమీక్షించారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా చేపట్టిన అంశాలపై ఆరా తీయాలని సూచించారు. కొన్ని మండలాల్లో సచివాలయాలకు కేటాయించిన విధుల్లో వెనుకబడి ఉన్నాయని, దీనికి సంబంధించిన ఎంపీడీవోలు పర్యవేక్షణ జరిపి లక్ష్యాలను చేరుకునేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో కె.సుబ్బారావు, ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ పి.సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

ఎంపీ మహేష్ ప్రశ్నలకు మంత్రి సమాధానం

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : గత పదేళ్ళలో రాష్ట్ర పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 371 కోట్లు మంజూరు చేసిందని ఎంపీ మహేష్‌కుమార్ అన్నారు. పార్లమెంట్‌లో ఎంపీ మహేష్ అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సమాధానమిచ్చారు. అలాగే ఏపీలో అంబేద్కర్ సోషల్ ఇన్నోవేషన్ అండ్ ఇంక్యూబేషన్ మిషన్ క్రింద లబ్ధిదారులు ఎవరూ లేరని మహేష్ అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర మంత్రి డాక్టర్ వీరేంద్రకుమార్ సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. కేంద్రంలో షెడ్యూల్ కులాల కోసం వెంచర్ కాపిటల్‌ఫండ్ పథకాన్ని 2015లో ప్రారంభించిందన్నారు. ఈ పథకంలో లబ్ధిదారులేవరు నమోదుకాలేదని మంత్రి తెలిపారు.

రత్నయ్య సేవలు ప్రశంసనీయం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : పోలీస్ శాఖలో రిటైర్డ్ ఏఎస్పీ పొనుకు రత్నయ్య పోలీస్ శాఖలో చేసిన సేవలు అందరికీ ఆదర్శనీయమని రిటైర్డ్ పోలీస్ సంఘ అధికారులు కొనియాడారు. ఈ నెల 3వ తేదీన రత్నయ్య అనారోగ్యంతో ఏలూరు విద్యానగర్‌లోని ఆయన స్వగృహంలో మరణించగా ఏలూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్ సమీపంలో ఉన్న విశ్రాంతి పోలీసు అధికారుల సంఘ కార్యాలయంలో రత్నయ్య సంస్మరణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రత్నయ్య సేవలను కొనియాడారు. విశ్రాంతి పోలీసు అధికారుల సంఘ కార్యదర్శి ఎస్.దాసరధి అధ్యక్షతన నిర్వహించగా రిటైర్డ్ డీఎస్పీలు పి.జె.జయరాజు, విజయరావు, రిటైర్డ్ ఎస్ఐ బివి రామకృష్ణ, పలువురు రత్నయ్య సేవలను కొనియాడారు.

అందరికీ న్యాయం చేయాలి

కుక్కునూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : కుక్కునూరు మండలం మొత్తాన్ని 2022 గోదావరి వరదల ప్రకారం యూనిట్‌గా తీసుకుని పరిహారం చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి ఎం.వెంకటాచారి డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ సమావేశంలో ఆయన మాట్లాడారు. 18సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికి ఆర్‌అండ్‌ఆర్ పరిహారం చెల్లించాలన్నారు. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్యామల, కొన్నే లక్ష్మయ్య, బాబురావు పాల్గొన్నారు.


అవార్డును అందుకుంటున్న జాకీర్ హుస్సేన్

జాకీర్ హుస్సేన్‌కు సేవా రత్న అవార్డు

టి.నరసాపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణకు చేసిన కృషి ఫలితంగా ఈ అవార్డు వచ్చిందని అప్పలరాజుగూడెం వనసంరక్షణ సమితి సభ్యులు షేక్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. బండివారిగూడెం గ్రామంలో ఆయన నివాసం వద్ద బుధవారం నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 2వ తేదీన రాజమహేంద్ర వరంలోని సితార గ్రౌండ్‌లో మేడిది సుబ్బయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవారత్న అవార్డు అందుకున్నట్టు తెలిపారు. గత 30 ఏళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వనసంరక్షణ సమితిలో సభ్యునిగా ఉంటూ సుమారు 75 హెక్టార్లలో వెదురు, జామాయిల్ మొక్కలు నాటి అటు పర్యావరణ పరిరక్షణతో పాటు కొన్ని కుటుంబాలకు జీవనోపాధి పొందడానికి తనవంతు కృషి చేసినట్లు ఆయన తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీగణపతి

లక్ష్మీగణపతికి అభిషేకాలు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మాఘ మాసంలోని తొలి బుధవారం కావడంతో సత్రంపాడులోని దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని లక్ష్మీగణపతికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని గరికతో అర్చన జరిపి బెల్లం నివేదనలు సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్.చిననాగేశ్వరరావు, సిబ్బంది భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు.

అర్చనలు, అభిషేకాలు..

కామవరపుకోట : రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయం వద్ద మాఘమాసంలోని తొలి బుధవారం సందర్భంగా స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. లలితాశ్రీ పీఠం వ్యవస్థాపకులు దుర్గబాబు, శ్రీనివాసాచార్యులు భక్తులతో పూజలు చేయించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

కొణిజర్లలో వరి సాగు పరిశీలన

లింగపాలెం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): వరి పంటలో అధిక దిగుబడులు సాధించేం దుకు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి కోటగిరి మురళీకృష్ణ అన్నారు. మండలంలోని కొణిజర్లలో బుధవారం రైతులతో కలిసి పంటను పరిశీలించారు. అనంతరం తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

టి.నరసాపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : రాజుపోతేపల్లి గ్రామానికి చెందిన కాన్సర్ బాధి తురాలు గుడిదల సత్యవతికి విజయనగరానికి చెందని రావెల ఫౌండేషన్ తరపున స్థానికటీటీటీ టీడీపీ నాయకులు చిలకా సుబ్బు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాన్సర్ బాధితురాలు గుడిదల సత్యవతి సమస్యను రావెల ఫౌండే షన్ చైర్మన్ ఉదయ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిలకా బాలయ్య, చిలకా రామారావు, చిలకా వెంకటేశ్వరరావు, గుడిదల యేసు, లంకా రవి పాల్గొన్నారు.

ప్రత్యేక రైల్వే బోగీల పెంపు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కాకినాడ టౌన్ నుంచి గయ నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు 07095, గయా నుంచి కాకినాడ టౌన్ నడుస్తున్న 07096 రైళ్ళకు ఈ నెల 8వ తేదీన, 10వ తేదీన త్రిటైర్ ఏసీ రెండు కోచ్‌లను అదనంగా ఏర్పాటు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు.

కేంద్ర బడ్జెట్‌పై అసంతృప్తి

జీలుగుమిల్లి, జనవరి 5 : (ఆంధ్రజ్యోతి) : కేంద్ర బడ్జెట్ కార్పొరేటర్లకు దోచి పెట్టేలా ఉందని రైతు సంఘం మండల కార్యదర్శి సి.హెచ్. సీతారామయ్య అన్నారు. సీఐటీయూ ఆధ్వ ర్యంలో బుధవారం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షులు దాసరి జానకిరామి రెడ్డి, గాంధీ, వెంకట లక్ష్మీ, రామారావు, శేషగిరిరావు, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు ఉన్నారు.

ఏలూరులో వాహనాల తనిఖీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు సహాయ వాహన తనిఖీ అధికారులు బుధవారం కొత్త బస్టాండ్, సీ.ఆర్.ఆర్. కళా శాల సమీపాల్లో ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి 92 కేసులు నమోదు చేశారు. ఈ తని ఖీల్లో సహాయ వాహన తనిఖీ అధికారులు అజ్మీరాబద్దు, ఎస్.నెహ్రూ, వి.ఎల్. కల్యాణి, ఎండీ జమీర్, పి.నరేంద్రబాబు, డి.ప్రజ్ఞ పాల్గొన్నారు.

ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ అప్పల నాయుడుకు సన్మానం

పెదవేగి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు పెదవేగి మండలం ముండూరు శివారులోని యజ్ఞవల్క్య రాజాశ్రమాన్ని బుధవారం సందర్శించారు. ఆశ్రమ పీఠాధిపతి, భారతీయ ధర్మ పరిషద్ జాతీయ అధ్యక్షులు శ్రీకృష్ణ చరణానంద భారతీస్వామి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడును, శ్రీకృష్ణ చరణానంద భారతీ స్వామి శాలువాతో సత్కరించారు. శ్రీకృష్ణ చరణానంద భారతీస్వామి మాట్లాడుతూ రెడ్డి అప్పలనాయుడు ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ కావడం శుభ పరి ణామమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులను అందుకోవాలని ఆకాంక్షించారు.


అప్పల నాయుడును సన్మానిస్తున్న స్వామీజీ

స్కూల్ బస్సు ఢీకొని బాలుడి మృతి


ఆస్పత్రిలో బాలుడి మృతదేహం
శ్రీదీక్షిత్ (ఫైల్)

పెదపాడు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పాతముప్పర్రులో రెండేళ్ల బాలుడిని స్కూల్ బస్ ఢీకొనడంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన వలదాసి ఏసుపాదం మనీషా దంపతులకు జోష్, శ్రీదీక్షిత్ (2) ఇద్దరు పిల్లలు ఉన్నారు. జోష్ వంగాయగూడెంలోని ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. పాఠశాల బస్ జయపురం నుంచి పాతముప్పర్రు మీదుగా విద్యార్థులను తీసుకువెళుతుంది. బుధవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో స్కూల్‌బస్ ఇంటి ముందు ఆగింది. తల్లి మనీషా కుమారుడు జోష్‌ను బస్ ఎక్కించింది. ఆ సమయంలో ఇంటి ముందు రోడ్డుపై ఉన్న చిన్న కుమారుడు శ్రీదీక్షిత్‌ను బస్ ఢీకొనడంతో తలకు గాయమై మృతి చెందాడు. ఈ సంఘటనపై తండ్రి ఏసుపాదం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి హెచ్‌సీ సీహెచ్ కృష్ణ దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరణ

యువకుడి ఆత్మహత్య

పెదవేగి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరించడంతో ఒక యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. ముండూరు గ్రామానికి చెందిన రంపా ఇంద్రపవన్, కామవరపుకోట మండలం సాగిపాడు గ్రామానికి చెందిన యువతి కొంతకాలంగా ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుందామని ఇంద్రపవన్ ఆమెను అడిగాడు. ఆమె నిరాకరించడంతో ఈనెల 3న ఇంటిదగ్గర పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో విజయవాడ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్న ఇంద్రపవన్ (23) బుధవారం ఉదయం మృతి చెందాడని ఎస్ఐ చెప్పారు. మృతుని తల్లి మనోహరం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

'ఆరోగ్యం కోసం ప్రకృతి వ్యవసాయం చేపడదాం'

చాట్రాయి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : రైతుందరూ కనీసం తమ కుటుంబ అవసరాలకు సరిపోను అయినా ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించుకోవాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి కోరారు. చాట్రాయిలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో శివశంకర్ రైతులతో కలిసి మొక్కజొన్న తోటలు పరిశీలించారు. అధిక దిగుబడులు, లాభాల కంటే కుటుంబ ఆరోగ్యం ముఖ్యమన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే వేపాకు కషాయం, నీమాస్త్రం, దశపర్ణి కషాయం, వావిలాకు కషాయం, కోడిగుడ్డు, చేపబెల్లం ద్రావణం మొదలైనవి రైతుల ఎదుట తయారు చేసి వాటి ఉపయోగాలపై అవగాహన కల్పించారు. కిసాన్ సంఘ్ నాయకుడు శీర్ణం వేణు, కంచర్ల హనుమంతరావు ఉద్యాన ప్రకృతి వ్యవసాయ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

బడ్జెట్‌లో పన్ను మినహాయింపుతో విశ్రాంత ఉద్యోగుల హర్షం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రబడ్జెట్‌లో వార్షిక ఆదాయం రూ.12 లక్షల వరకు ఆదాయ పన్నును మినహాయింపు ఇవ్వడం పట్ల విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం హర్షం వ్యక్తం చేసింది. బుధవారం నూజివీడులో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బీఎం సింగ్, ప్రధాన కార్యదర్శి బండారు సత్యనారాయణలు మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగులక్షల మంది విశ్రాంత ఉద్యోగుల్లో 80 శాతం మందికి ట్యాక్స్ లబ్ధి చేకూరుతుందన్నారు. విశ్రాంత ఉద్యోగులు టి.స్టాలిని ప్రభాకర్, కె.జె.డి రీచెర్డ్, దిలీప్, సాంబయ్య, విజయలక్ష్మి పాల్గొన్నారు.

అనారోగ్యంతో టీడీపీ మాజీ ఎంపీటీసీ ప్రభాకర్ రావు మృతి

ముసునూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ముసునూరుకు చెందిన టీడీపీ మాజీ ఎంపీటీసీ సభ్యుడు చలసాని ప్రభాకర్‌రావు (65) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. నాలుగు నెలలుగా తీవ్ర ఆనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. ఎంపీటీసీగా, ఉప సర్పంచ్‌గా పనిచేశారు. చల సాని మృతదేహాన్ని ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయ కులు, గ్రామ ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్య లకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. చలసాని మృతి పార్టీకి తీరని లోటని నాయకులు అన్నారు.

కన్నుల పండువగా శోభనాచలుని రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న మంత్రి పార్థసారథి

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గోవిందా.. గోవిందా.. అంటూ భక్తుల నామస్మరణల నడుమ బుధవారం ఆగిరిపల్లిలో శోభనాచల వ్యాఘ్ర లక్ష్మి నరసింహస్వామి రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. మంత్రి కొలుసు పార్థసారథి కుంభం పోసి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథోత్సవంలో దాదాపు నాలుగు గంటల పాటు మంత్రి పాల్గొన్నారు. మహి ళలు, యువ కులు రథాన్ని ముందుకు లాగారు. రథంపై అధిరోహించిన స్వామి వారిని దర్శించుకుని భక్తజనం పులకించారు. గ్రామంలోని నాలుగు మాడ వీధుల్లో దాదాపు ఐదు గంటల పాటు ఈ రథోత్సవం జరిగింది. మేళ తాళాలు, కోలాట భజ నలు, బేతాళ నృత్యం, తీన్‌మార్ డప్పు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆలయ అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంతకృష్ణ రథంపై స్వామివారిని అలంకరించారు. తహసీల్దార్ ప్రసాద్, నగుర్తి రమేష్, విక్టర్‌బాబు, మాదల సత్యకుమార్ మాదల బుజ్జి, బెజవాడ శ్రీనివాసరావు, నైనవనపు వేణు, ఆలయ ఈవో సాయి పాల్గొనగా ఎస్సై శుభశేఖర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.


చనుబండ పీహెచ్‌సీ భవన నిర్మాణం కోసం కేటాయించిన స్థలం

స్థలం ఉన్నా.. ప్రయోజనం సున్నా

చనుబండ పీహెచ్‌సీ భవన నిర్మాణంపై కొనసాగుతున్న ప్రతిష్ఠంభన

చాట్రాయి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని చనుబండలో మూడేళ్ల క్రితం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు కాగా, దాత స్థలం ఇచ్చినా ఇంత వరకు భవన నిర్మాణ జరగలేదు. దాతలు ముందుకొచ్చి స్థలం విరాళంగా ఇస్తే భవనం నిర్మిస్తామని అప్పట్లో ప్రజాప్రతినిదులు అధికారులు ప్రకటించారు. దీనికి స్పందించిన ఎన్నారై మల్లెల శ్రీనివాస్ వేమిరెడ్డిపల్లి రోడ్డులో రూ.25 లక్షలతో ఎకరం భూమి కొనుగోలు చేసి పీహెచ్‌సీకి దానంగా ఇచ్చారు. ఇది జరిగి దాదాపు రెండున్నర ఏళ్లు అవుతుండగా వివిధ కారణాల వలన భవనం నిర్మాణం మొదలవడం లేదు. దీనితో ప్రజలకు వైద్య సేవలు అందడం లేదు. ప్రస్తుతం పీహెచ్‌సీని స్థానిక ఉప కేంద్రంలో నిర్వహిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో దాత ఇచ్చిన స్థలంలో పీహెచ్‌సీ నిర్మాణానికి రెండు సార్లు టెండర్లు పిలిచారు. బిల్లులు రావడం లేదనే భయంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పీహెచ్‌సీకి దాత ఇచ్చిన స్థలం అనువుగా లేదని మరో స్థలం ఎంపిక చెయ్యాలని నిర్ణయం తీసుకున్నారు. దీనితో ప్రతిష్ఠంభన ఏర్పడింది. మంత్రి కొలుసు పార్థసారథి సూచనలతో కూటమి నాయకులు అధికారులు చనుబండ- నరశింహారావుపాలెం మధ్య ఓ స్థలాన్ని ఎంపిక చేశారు. దాత ఇచ్చిన స్థలం తీసుకుని సదరు భూమి పీహెచ్‌సీకి ఇచ్చేలా రైతుతో మాట్లాడారు. మంత్రి దృష్టిలో పెట్టి దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామని నాయకులు చెపుతున్నారు. స్థలం ఖరారైతే మరోసారి టెండర్లు పిలవాల్సి ఉందని నూజివీడు ఆర్‌అండ్‌బీ డీఈఈ బాబూరావు తెలిపారు.

వైస్ చైర్మన్‌కు అభినందన

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నూతన మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన పగడాల సత్యనారాయణను నూజివీడు టైలర్స్ వర్కర్స్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు. బుధవారం పగడాల సత్యనారాయణను కలిసి అభినందనలు తెలిపారు. చేతివృత్తిదారుల అభివృద్ధికి సహ కరిం చాలని ఆకాంక్షించారు. యూనియన్ అధ్యక్షులు షేక్ రఫీ, కార్యదర్శి షబ్బీర్, గౌరవాధ్యక్షుడు దాసిరెడ్డి అనిల్, జగన్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోషకాహారం

ముసునూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు పోషకాహారాన్ని సమపాళ్లలో ఇవ్వడం వల్ల వారు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని అంగన్‌వాడీ కార్యాకర్త పి.రాజకుమారి అన్నారు. బుధవారం చింతలవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే నిర్వహించారు. తల్లుల సమావేశంలో ప్రీస్కూల్ బుక్స్‌ను చూపించి, వారికి నేర్పించే విధనాన్ని రాజకుమారి వివరించారు. పిల్లలకు ఆటలు, పాటలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. పిల్లలను సక్రమంగా అంగన్‌వాడీ కేంద్రాలను పంపాలన్నారు.

కైకలూరు పంచాయతీలో.. అవకతవకలపై విచారణ


అవకతవకలపై విచారణ చేస్తున్న జంగారెడ్డిగూడెం డీఎల్పీవో ఎండీ రజావుల్లా

కైకలూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కైకలూరు పంచాయతీలో ఆర్థిక అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ చేసి ఉన్నతాధి కారులకు నివేదిక అందజేస్తామని జంగారెడ్డిగూడెం డీఎల్‌పీవో మహ్మద్ రజావుల్లా అన్నారు. కైకలూరు పంచాయతీలో 2021-22 నుంచి ఇప్పటి వరకు పలు అంశాలపై అందిన వివిధ ఫిర్యాదులపై బుధవారం ఆయన విచారణ చేపట్టారు. పన్ను వసూలు, జమ, ఖర్చులు, పరిపాలనా తీర్మానాలపై వార్డు సభ్యుడు డీఎస్.రావు ఫిర్యాదు చేశారు. సచివాలయాల నిర్మాణాలకు అనధికారికంగా పంచాయతీ నిధులు మళ్లించారని సర్పంచ్ డీఎం నవరత్న కుమారి, ఆమె భర్త దానం ప్రసాద్‌పై ఫిర్యాదు చేశారు. కాంట్రాక్ట్ సిబ్బందితో వెట్టిచాకిరీ చేయించుకుంటూ సర్పంచ్ భర్త దూషిస్తున్నారని పలువురు సిబ్బంది ఫిర్యాదు చేశారన్నారు. సర్పంచ్ కొంతమందిపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టి తనను సాక్ష్యం చెప్పాలని ఒత్తిడి చేస్తున్నారని, తనను విధుల నుంచి తొలగించారని పారిశుధ్య కార్మికురాలు దేవకృప ఫిర్యాదు చేసింది. ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి ఆనంద భూషణం అనేక అవకతవకలకు పాల్పడ్డారని సర్పంచ్ నవరత్నకుమారి కూడా డీపీవోకు ఫిర్యాదు చేసినట్టు డీఎల్పీవో రజావుల్లా వివరించారు. పూర్తిస్థాయి విచారణకు పదిమంది అధికారులతో కమిటీని ఏర్పాటు చేశామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఎఫ్‌డీబీ అధికారిణి సుష్మ

ఆక్వా రైతులు బీమా సౌకర్యాన్ని వినియోగించుకోవాలి

ఎన్ఎఫ్‌డీబీ సీనియర్ ఈవో సుష్మ

కైకలూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆక్వా రైతులను సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు బీమా పథకాలను అమలు చేస్తున్నట్లు ఎన్ఎఫ్‌డీబీ సీనియర్ ఈవో బి.సుష్మ తెలిపారు. కైకలూరులో మత్స్యశాఖ, నేషనల్ ఫిషరీస్‌బోర్డు (ఎన్ఎఫ్‌డిబి) సంయుక్త ఆధ్వర్యంలో ఆక్వా రైతులకు బీమా పథకాలపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మత్స్యశాఖ అధికారులు ఏర్పాటుచేసిన యాప్‌లో రైతు వివరాలు, విస్తీర్ణం పొందుపరచాలన్నారు. నంబూరి వెంకటరామరాజు, ముదునూరి సీతారామరాజు, జిల్లా మత్స్యశాఖ అధికారి కేఎస్‌వీ నాగలింగాచార్యులు, లీడ్‌బ్యాంక్ మేనేజర్ డి.నీలాద్రి, బీమా కంపెనీ ప్రతినిధులు, మత్స్యశాఖ ఏడీ నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు విద్యార్థుల సాయం

మండవల్లి ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): భైరవపట్నం సమీపంలోని పత్తిపాడు స్టేజీ వద్ద ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులకు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం సాయం అందజేశారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు దాతల నుంచి సేకరించిన రూ.12వేలు నగదు, దుస్తులు, సుమారు 100 కేజీల బియ్యం, వంట పాత్రలు బాధితులకు అందజేశారు. చాపరాల దుర్గాప్రసాద్, హెచ్ఎం పీవీఎస్ఎస్‌జీ.ప్రసాద్, ఎస్ఎంసీ చైర్మన్ కృష్ణవేణి, గ్రామపెద్దలు సత్తిబాబు పాల్గొన్నారు.


బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న హైస్కూల్ ఉపాధ్యాయులు


గణేష్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కార్యకర్తలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే

మండవల్లి ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు కష్టంలో ఉంటే అండగా ఉంటామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. టీడీపీ నాయకుడు గుడివాడ గణేశ్ తండ్రి శ్రీరామగాంధీ ఇటీవల మృతి చెందడంతో బుధవారం పరామర్శించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చాపరాల దుర్గాప్రసాద్, సజ్జా సురేష్‌బాబు, ముళ్లపూడి సత్తిబాబు, గుడివాడ బాలాజీ, మారగాని మురళీకృష్ణ, సమయం ఏసుబాబు, లోకుముడి బాషా, యార్లగడ్డ శంకర్, బోయిన రాజేష్, వీరవల్లి శివయ్య, గోల్కొండ చంద్రశేఖర్, పడమట గణేశ్, నల్లిబోయిన రాజేశ్, నల్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుపతమ్మ కల్యాణోత్సవం



ముదినేపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చేవూరుపాలెం శ్రీలక్ష్మీ తిరుప తమ్మ - గోపయ్యస్వామి కల్యాణం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. బుధవారం ఆలయం వద్ద ప్రత్యేక పూజల అనందరం భారీ అన్నసమారాధన జరిగింది. ఆలయ నిర్వాహకులు రంగిశెట్టి నాగబాబు, లక్ష్మీ దంపతులు, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర ముదిరాజ్ సంఘ అధ్యక్షులు కోమటి విష్ణువర్ధన్, శీలం రామకృష్ణ, బండి సత్యనారాయణ, రంగిశెట్టి నరసింహారావు తదితరులు పూజలు చేశారు. కల్యాణోత్సవంలో సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, మేలిమి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు

దుకాణదారులు సహకరించాలి : సీఐ

కైకలూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కైకలూరులో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా దుకాణాదారులు సహకరించాలని టౌన్ సీఐ పి.కృష్ణ అన్నారు. దుకాణాల వద్ద వాహనాల నిలుపుదల, హెల్మెట్ ధారణపై బుధవారం అవగాహన కల్పించారు. దుకాణాల వద్ద బైక్‌లను అడ్డదిడ్డంగా పార్క్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నా యని, వాహనాలను రహదారిపై నిలుపుదల చేయకుండా దుకాణా దారులకు అవగాహన కల్పించారు. ఎస్ఐలు ఆర్.శ్రీను, డి.వెంకట్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


ద్విచక్ర వాహనదారులతో హెల్మెట్‌లు కొనుగోలు చేయించిన పోలీసులు

బాలికపై అత్యాచారం

కలిదిండి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బాలికపై ఓ బాలుడు అత్యాచారం చేశాడు. మండలంలోని జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బాలిక (15)పై అదే స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బాలుడు గత నెల 29న అత్యాచారం చేశాడు. ఇది గమనించిన నలుగురు యువకులు బాలికను బ్లాక్‌మెయిల్ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కైకలూరు సీఐ రవికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం ఏర్పాటు

ముదినేపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ మండల కార్యవర్గం ఎంపికైంది. బుధవారం జరిగిన సమావేశంలో గౌరవాధ్యక్షుడిగా మల్లెల శ్రీనివాస్, అధ్యక్షురాలిగా సుంకర హారిక, ఉపాధ్యక్షుడిగా షేక్ యాకూషా వలీ, కార్యదర్శిగా పరసా సురేష్, కోశాధికారిగా జుజ్జవరపు గిరిజ, సంయుక్త కార్యదర్శిగా సంబంగి సుబ్రహ్మణ్యం, ప్రచార కార్యదర్శిగా లోకం శివనాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

కలిదిండి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ విద్యార్థులు ఫేర్‌వెల్ వేడుక ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. జూనియర్ ఇంటర్ విద్యార్థులు సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు పలికారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేసి అధ్యాపకులను సత్కరించారు. ప్రిన్సిపాల్ జి.త్రినాథ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై హర్షం

ముదినేపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏపీలో రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం భారీ నిధులు కేటాయించడం హర్షణీయమని సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ స్టేషన్ కమిటీ సభ్యుడు మేలిమి చిట్టిబాబు అన్నారు. కేంద్ర ప్రభుత్వ రైల్వే బడ్జెట్‌లో 73 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి, ఇతర ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.9417 కోట్లు కేటాయించిందన్నారు. రైల్వే ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కలుగుతాయన్నారు.

లక్ష్యాలను పూర్తి చేయండి

ముసునూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లక్ష్యాలను నేరవేర్చేలా అధికారులు పని చేయాలని నూజివీడు డీఎల్‌పీవో సుందరి అన్నారు. బుధవారం మండల కార్యాలయంలో ఆమె ఆర్‌డబ్ల్యూఎస్, డీసీబీ కలెక్షన్స్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. డీఎల్‌పీవో మాట్లాడుతూ గ్రామాల్లో మంచినీటి ఇబ్బందులు లేకుండా పంచాయతీ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నీటి ఇబ్బందులు ఉన్న గ్రామాల్లో బోరు ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. కుళాయి, ఇంటి పన్నుల వసూలను వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం హౌస్ హోల్డ్ సర్వే సమగ్రంగా చేయాలన్నారు. ఉత్తమ సేవా అవార్డు పొందిన సందర్భంగా డీఎల్‌పీవో సుందరిని ఎంపీడీవో జి.రాణి, ఈవోపీఆర్డీవో బి.సత్యనారయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సత్య ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ నగ్మార్తి శ్రీనివాస రావు సన్మానించి అభినందలు తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

చాట్రాయి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా చిత్తపూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 117 మంది విద్యార్థినీ, విద్యార్థులకు పరీక్షలు జరిపి అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం విద్యార్థినులకు కౌమార దశలో వచ్చే శారీరక మార్పులు, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాల వలన అనర్థాలు, రక్తహీనతను అధిగమించటానికి తీసుకోవాల్సిన ఆహారం మొదలైన అంశాలపై డాక్టర్ విజయలక్ష్మి అవగాహన కల్పించారు. సీహెచ్‌వో రమణ, హెచ్ఎం రంగారావు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాగు పద్ధతులపై రైతులకు అవగాహన

ముసునూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగుచేసే పంటల యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కలిగి ఉండాలని ఏలూరు డీఆర్‌సీ ఏడీఏ పి.లలితకుమారి అన్నారు. బుధవారం యల్లాపురం, వేల్పుచర్ల గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో కె.సీహెచ్ సూరిబాబుతో కలిసి ఏడీఏ క్షేత్రస్థాయిలో మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ప్రభుత్వం రూపొందించిన ఎన్‌పిఎస్ఎస్ యాప్‌ను ఉపయోగించే విధనాన్ని రైతులకు వివరించారు. రైతుల వివరాలతో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసి, పొలానికి వెళ్లి పంటలో ఉన్న పురుగును ఫోటో తీస్తే పురుగు నివారణకు చేపట్టాల్సిన చర్యలతో పాటు యాజమాన్య పద్ధతులు సైతం ఉంటాయని తెలిపారు. భూసారపరీక్షల కార్డులను అందించి అవగాహన కల్పించారు. ప్రతి రైతు ఈ-పంటలో నమోదు చేయించుకోవాలని సూచించారు.


ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

క్యాంపస్ ఎంపికల్లో 46 మందికి ఉద్యోగాలు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో మొత్తం 46 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్ తెలిపారు. ఇన్ఫోసిస్ సంస్థలో 25 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా, 22 మంది ఎంపికయ్యారన్నారు. సీఎస్ఈ నుంచి 20 మంది ఎంపికవగా, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగం నుంచి ఇద్దరు ఎంపికయ్యారు. హెటిరో డ్రగ్స్ సంస్థకు కెమికల్ ఇంజినీరింగ్ నుంచి 18 మంది జూనియర్ ఇంజినీర్లుగా ఎంపికయ్యారని, శ్రీకరా కనస్ట్రక్షన్స్‌లో ఆరుగురు సివిల్ ఇంజినీరింగ్ నుంచి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను ఆయన అభినందించారు. ఆయా విభాగాల హెచ్‌వోడీలు, అకడమిక్స్ డీన్ డాక్టర్ చిరంజీవి పాల్గొన్నారు.

మేధావులను చట్టసభలకు పంపాలి : మంత్రి సారథి


సభలో మాట్లాడుతున్న మంత్రి సారథి

నూజివీడు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : మేధావులను చట్టసభలకు పంపటం ద్వారా దేశాభివృద్ధి సాధించవచ్చని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు పట్టణంలో మంత్రి క్యాంప్ కార్యాలయంలో పట్టభద్రుల ఎన్నికలపై తెలుగు దేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ నెల 27న జరిగే గుంటూరు, కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్ ఎన్నికల సందర్భంగా గ్రాడ్యుయేట్ ఓటుహక్కు వినియోగించడంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. 9,600మంది గ్రాడ్యుయేట్ ఓటర్లుగా ఉన్నారని వారంతా మేధావులను చట్టసభలకు పంపాలన్నారు. తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలి పించేలా టీడీపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. నూజివీడు టీడీపీ అధ్యక్షుడు మల్లిశెట్టి జగదీష్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, మాజీ శాసనసభ్యుడు ఘంటా మురళీ, నాయకులు నూతక్కి వేణుగోపాలరావు, అట్లూరి రమేష్, చిట్నేని శివరామకృష్ణ, దేవినేని బలరామ్, ముసునూరు రాజా తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ కాళ్లు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): దాతల విరాళాలే స్వచ్ఛంద సేవలకు స్ఫూర్తి అని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్, ప్రస్తుత పిన్నమనేని సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సస్ డైరెక్టర్ డాక్టర్ సీవీ రావు తెలిపారు. మండలంలోని తోటపల్లిలోని హీల్ పారడైజ్ కృత్రిమ అవయవ కేంద్రంలో ప్రముఖ సంఘ సేవకుడు, విశ్రాంత ఇంజినీర్ కాకర్ల శంకరరావు, 72-73 బ్యాచ్ అనంతపురం ఇంజినీరింగ్ కాలేజి విద్యార్థుల బృందం, అర్చిచావా, ఆరాధ్య యలమంచిలి (అమెరికా), యలమంచిలి శుభాష్ చంద్రబోస్‌లు అందించిన విరాళంతో గుంటూరుకు చెందిన వేదం పావని, వి.ఉష, పొదిలికి చెందిన కె.నాగలక్ష్మి, విజయవాడకు చెందిన జి.రమేష్, ఎన్.శ్రీను, కె.సునీల్ బాబు, జంగం రమేష్, పి.శివరామకృష్ణ, కంచికచర్లకు చెందిన నాగేశ్వరరావులకు కృత్రిమ కాళ్ళను అందచేసినట్లు తెలిపారు. విశ్రాంత ఐజీ దామోదర నాయుడు మాట్లాడుతూ హీల్ సంస్థ అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని తెలిపారు. హీల్ సీఈవో కూరపాటి అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 644కృత్రిమ కాళ్ళు అందజేశామన్నారు. మర్చంట్ నేవీ చీఫ్ ఇంజినీర్ ఎం.వెంకటేశ్వరరావు, డా.కె. కృష్ణారావు (అమెరికా), డాక్టర్ కోనేరు ఉషా,హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి పాల్గొన్నారు.

సారా విక్రయించే మహిళ అరెస్ట్

ముసునూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ముసునూరులో సారా విక్రయాలు సాగిస్తున్న మహిళను ఎక్సైజ్ పోలీసులు బుదవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ ఏ.మస్తానయ్య ఆధ్వర్యంలో జరిగిన దాడుల్లో ఒక మహిళ నుంచి 2 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని అదుపులోకి తీసుకుని మూడున్నర టన్నుల రేషన్‌బియ్యాన్ని నూజివీడు పీడీఎస్ డీటీ వెంకటేశ్వర రావు అదుపులోకి తీసుకున్నారు. చంద్రాల నుంచి వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు వాహనాన్ని స్వాధీన పరుచుకుని, వాహన యజమాని మాదరాజు కృష్ణశివదీప్, పెద్దిరెడ్డిల రామచంద్రరావు, చప్పిడి వెంకటకృష్ణలపై కేసు నమోదు చేశామన్నారు. రేషన్ బియ్యాన్ని అన్నవరం రైస్‌మిల్లులో భద్రపరిచినట్లు తెలిపారు.

గడువు పెంపు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గీతకార్మికుల కులాలకు కేటాయించిన మద్యం దుకాణాలకు దరఖాస్తుల గడువును నేటి సాయంత్రం 5 గంటల వరకు పెంచినట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ ఏ.మస్తానయ్య తెలిపారు. నూజివీడు సర్కిల్‌పరిధిలో మున్సిపాలిటీలో గౌడ కులస్థులకు చాట్రాయి, ఆగిరిపల్లి, ముసునూరు మండలంలో శెట్టిబలిజ కులాలకు మద్యం దుకాణాలను కేటాయించారన్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత

చాట్రాయి, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపేటలో తెలంగాణ మద్యం విక్రయిస్తున్న కోరుకొండ ప్రసాద్‌ను అదుపులోకి తీసుకొని, అతని వద్ద 11 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరెంటెంట్ అజయ్ కుమార్ సింగ్ తెలిపారు. మండలంలోని పోతనపల్లి చిన్న తండాలో జరిపిన దాడిలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 250 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు.

10న ఉచిత కంటి వైద్యశిబిరం

చాట్రాయి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సత్య సాయి సేవా ట్రస్ట్ విస్సన్నపేట, చనుబండ భజన మండలి ఆధ్వర్యంలో నూజివీడు అమెరికన్ హస్పటల్ సౌజన్యంతో 10న చనుబండ పాత పంచాయతీ కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు రంగారెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.